



నరసరావుపేట ప్రాంతంలో పనులు చేస్తున్న ఉపాధి కార్మికులు

గంట ముందే కేంద్రాల్లోకి అనుమతి

- నేటి నుంచి పది పరీక్షలు.. ఏర్పాట్లు పూర్తి
- ఫిర్యాదుల కోసం డీఈవో కార్యాలయాల్లో హెల్ప్‌లైన్
- హాల్‌టిక్కెట్‌పై విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

గుంటూరు(విద్య), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను ఆయా కేంద్రాల్లోకి గంట ముం దు అనుమతిస్తామని విద్యాశాఖాధికారులు తెలిపారు. గంట ముందుగా అంటే ఉదయం 8.30 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకుంటే ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉంటుందని సూచిస్తున్నారు. రోజు మార్చి రోజు నిర్వహిస్తున్నందున పరీక్షకు సిద్ధమయ్యేందుకు విద్యార్థులకు సమయం దొరుకుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్షలపై వచ్చే ఫిర్యాదుల కోసం విద్యాశాఖ కార్యాలయాల్లో ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లోకి ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకురాకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని, పరీక్ష జరిగే కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఉద యం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు అంటే ఎండల సమయంలో పరీక్షలు జరుగుతున్నందన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశా రు. కేంద్రాల వద్ద వైద్య సేవలకు ఏఎన్ఎమ్‌లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర మందులను కూడా అందుబాటులో ఉంచారు. ఏ ఒక్క విద్యార్థి కూడా కింద కూర్చోకుండా బెంచీలతో పాటు గాలి, వెలుగు ప్రసరించేలా ఆయా గదుల్లో ఏర్పాట్లు చేశారు. విద్యార్థుల సౌకర్యం కోసం హాల్ టిక్కెట్ చూపించి ఉచితంగా ప్రయాణం చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. అంతేగాకుండా కేంద్రాల వద్దకు అవసరాన్ని బట్టి ప్రత్యేక బస్సులు నడిపే ఏర్పాట్లను కూడా విద్యాశాఖ చేపట్టింది.

ఆరు సమస్యాత్మక కేంద్రాలు

గుంటూరు జిల్లాలో ఈ ఏడాది పరీక్షలకు 29,449 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు డీఈవో రేణుక తెలిపారు. వీరిలో బాలురు 15,382 బాలికలు 14067 మంది ఉన్నారన్నారు. గుంటూరు డివిజన్‌లో 94, తెనాలి డివిజన్‌లో 56 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని, వీటిలో ఆరు సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలపై ఫిర్యాదుల కోసం 9951397109, 9052343447 నంబర్లను అందుబాటులో ఉంచామన్నారు. పరీక్షలకు 1700 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో పాల్గొంటారని తెలిపారు. దూర విద్య పది పరీక్షలకు జిల్లాలో 21 కేంద్రాలు ఏర్పాటు చేయగా, 1133 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.



పది కేంద్రంలో నెంబర్లు వేస్తున్న అధికారులు

బాపట్ల జిల్లాలో 103 కేంద్రాలు

బాపట్ల జిల్లాలో 103 కేంద్రాల్లో 16,799 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. వీరిలో బాలికల సంఖ్య 8,317, బాలుర సంఖ్య 8,482. జిల్లాలో ఏ కేటగిరి కింద 33, బీ కేటగిరి కింద 41, సీ కేటగిరి కింద 29 కేంద్రాలను చేర్చి వసతుల కల్పనకు అన్ని చర్యలు చేపట్టారు. పరీక్షల నిర్వహణకు 110 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, 12 మంది రూట్ ఆఫీసర్లతో పాటు అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లను నియమించారు. ఆరు ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలతోపాటు 105 మంది క్లర్కులు, ఏఎన్ఎంలు, 1048 మంది ఇన్విజిలేటర్లు వి . దులు నిర్వహించనున్నారు. 220 మంది పోలీసులతో కేం ద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేసినట్లు డీఈవో తెలిపారు.

పనులు చేసినా.. పస్తులే

వలసలు నివారించి.. స్థానికంగా పనులు కల్పిస్తూ.. కూలీలకు అండగా ఉపాధి హామీ పథకాన్ని అధికారులు అమలు చేయాలి. అయితే కూలీలతో పనులు చేయించుకుని వారికి ఇవ్వాల్సిన కూలి నగదును పెండింగ్ పెడుతున్నారు. పనులు చేసినా పస్తులు ఉండాల్సి వస్తుందని కూలీలు వాపోతున్నా అధికారులు ఆలకించడంలేదు. ఒకటి రెండు రోజులు అయితే పర్వాలేదు కానీ రెండు నెలలుగా కూలీలతో పనులు చేయించుకుని రూ.41.25 కోట్లు బకాయి పెట్టారంటే అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. పనులు చేశాము.. ఖాతాల్లో నగదు జమ అవు తుందని కూలీలు రోజుల తరబడి ఎదురుచూస్తున్నా వారి ఆశలు అడియాశలవుతున్నాయి. జనవరి 15వ తేదీ నుంచి ఇప్పటి వరకు పనులు చేసిన కూలీలకు ఉపాధి సొమ్ములు చెల్లించలేదు. పనులకు సంబంధించిన సామగ్రి బిల్లుల బకాయిలు కూడా రూ.131.06 కోట్లు ఉన్నాయి.

- ఉపాధి కూలీల ఆకలి కేకలు
- రెండు నెలలుగా అందని కూలి
- కూలీలకు రూ.41.25 కోట్లు.. సామగ్రికి రూ.131.06 కోట్ల బకాయి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉపాధి కూలీలు.. వేతనాలు అందక అల్లాడుతున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో దాదాపు రూ.41.25 కోట్లు బకాయిలు ఉండటంతో కూలీలకు వ్యథలు తప్పడం లేదు. కూలీలు చేసిన పనులకు వారం వారం కాదు కదా నెలకొకసారి కూడా కూలి చెల్లించడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వలసలు నివారించడం, వ్యవసాయ కార్మికులు, కూలీలకు పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో లోపాలు చోటు చేసుకుంటున్నాయి. చేసిన పనికి రెండు రోజుల్లో ప్రతి కార్మికుడికి కూలి సొమ్ము వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు జమ చేయాల్సి ఉండగా చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. చేసిన పనికి వెను వెంటనే కూలి రాకపోతుండటంతో ఉపాధి పనులపై కార్మికులు ఆసక్తి చూపడంలేదు. ప్రతివారం క్షేత్రస్థాయి సిబ్బంది కూలీల వారీగా వారికి చెల్లించాల్సిన కూలి వివరాలను మండల కార్యాలయానికి పంపిస్తారు. వాటిని ఆన్‌లైన్లో నమోదు చేసిన రెండు రోజులకు వారి ఖాతాల్లో నగదు జమ చేయాలి. కూలి వివరాల సేకరణ.. ఆన్‌లైన్‌లో నమోదు.. తదితర ప్రక్రియలు సక్రమంగా జరుగుతున్నా నగదు మాత్రం వారి ఖాతాల్లో జమ కావడంలేదు. జనవరి 15 నుంచి కూలి చెల్లించడంలేదు.

జాబ్ కార్డులు ఇలా..

పల్నాడు జిల్లాలో అత్యధికంగా జాబ్ కార్డులు నమోదు చేశారు. 5.77 లక్షల జాబ్ కార్డులు రిజిస్ట్రేషన్ చేయగా 4.53 లక్షల కార్డులు మాత్రమే యాక్టివ్‌లో ఉన్నాయి. గుంటూరు జిల్లాలో 2.09 లక్షల కార్డులకు 1.51 లక్షలు, బాపట్ల జిల్లాలో 4.72 లక్షలకు 3.74 లక్షల కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. నమోదు చేసుకున్న వారందరూ పనులకు హాజరు కావడంలేదు. పేరు నమోదు చేసుకోని కూలీల సంఖ్యలో లక్షల్లో ఉంది. వీరికి కూడా ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఉపాధి పనుల్లో కార్మికుల పని దినాలను ముందుగానే అంచనా వేస్తున్నా ఆ మేరకు పని దినాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నట్లు లెక్కలు తెలియజేస్తున్నాయి.

బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన రోడ్లు, మురుగు కాల్వలు, పాఠశాలల ప్రహరీల నిర్మాణ పనులు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో పెద్దఎత్తు జరిగాయి. గోకులం షెడ్ తదితర పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు సకాలంలో జరగడంలేదు. పూర్తయిన పనులకు నెలలు తరబడి బిల్లులు చెల్లింపులు నిలిచిపోయాయి. పల్లెపండుగ పథకం ప్రారంభంలో వారం.. వారం బిల్లుల చెల్లింపులు మొదటి రెండు వారాలు మాత్రమే జరిగాయి. ఆ తర్వాత నుంచి బిల్లుల చెల్లింపులు ఆగి పోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పల్నా డు జిల్లాలో రూ.61.90 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.44.12, గుంటూరు జిల్లాలో రూ.15.04 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. కమిటీల పర్యవేక్షణలో చేపట్టిన పనులకు కూడా చెల్లింపుల్లో జాప్యం జరుగు తుండటంతో నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. కాగా పనులకు సంబం, ధించిన బిల్లులను అప్‌లోడ్ చేశామని పల్నాడు జిల్లా డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి తెలిపారు.

వేసవి భత్యాలు రద్దు

గతంలో వేసవిలో ఉపాధి పనులు చేసే వారికి ఫిబ్రవరిలో 20, మార్చిలో 25, ఏప్రిల్లో 30 శాతం అదనపు కూలి ఇచ్చేవారు. మజ్జిగ కూడా సరఫరా జరిగేది. తాగునీటికి రూ.5, గునపానికి రూ.10, తట్టకి రూ.13 చెల్లించేవారు. ప్రస్తు తం వీటినీ రద్దు చేశారు. దీంతో వేతన దారులపై ఆర్థికభారం పడుతోంది.

ప్రారంభించిన పనులన్నీ.. పూర్తి చేస్తున్నాం

- త్వరలో మానస సరోవరం అభివృద్ధి పనులు
- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- మోడల్ నియోజకవర్గంగా పొన్నూరు: ఎమ్మెల్యే నరేంద్ర
- మూడు గ్రామాల్లో రూ.6.70 కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన



జొన్నలగడ్డ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పెదకాకాని, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): 'గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం తట్ట మట్టి కూడా ఎత్తలేదు. తాము అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే రూ.కోట్లతో చేసిన పనులు ప్రారంభించి అందులో చాలావరకు పూర్తి చేశాం..' అని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని తక్కెళ్లపాడు, పెదకాకాని, కొప్పురావూరు గ్రామాల్లో రూ.6.70 కోట్ల విలువైన రహదారులు, కల్వర్టుల నిర్మాణాలకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌తో కలిసి పెమ్మసాని ఆదివారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. తక్కెళ్లపాడులో రూ.43 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ప్రారంభోత్సవం, రూ.23 లక్షల ఉపాధి నిధులతో చేపట్టిన కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పెదకాకానిలో రూ.70 లక్షలతో మూడు పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ తక్కెళ్లపాడులో కల్వర్టు, పెదకాకానిలో సీసీ రోడ్డు తప్ప అన్ని పనులు పూర్తి చేశామన్నారు. బాపట్ల - బుడంపాడు హైవేను నాలుగు లేన్లగా అభివృద్ధిపై ప్రధాని మోదీకి వివరించి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ఢిల్లీలో ఉన్న అవకాశాలు, సత్సంబంధాలు అన్నింటిని ఉపయోగించి నరేంద్ర అడిగిన మేరకు పనులు పూర్తి చేసే బాధ్యత తనదన్నారు. మానస సరోవరం అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ పొన్నూరును మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తున్నామన్నారు. పెదకాకానిలోని ఎన్టీఆర్ విగ్రహానికి తొలుత పెమ్మసాని, ధూళిపాళ్ల పూలమాలలు వేసి నివాళులర్పించారు.



తక్కెళ్ళపాడులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని, ఎమ్మెల్యే నరేంద్రకుమార్

నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం

- మేయర్ రాజీనామాపై 20న అత్యవసర కౌన్సిల్ సమావేశం
- కార్పొరేటర్లకు నోటీసులు జారీ చేసిన కౌన్సిల్ సెక్రటరి

గుంటూరు కార్పొరేషన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో సోమవారం మధ్యాహ్నం స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవల ఎన్నికైన ఆరుగురు సభ్యులు ఈ స్టాండింగ్ కమిటీ సమావేశానికి హాజరు కానున్నారు. ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలపనున్నారు. నగర మేయర్ మనోహర్‌నాయుడు తన పదవికి రాజీనామా చేయడం, రాజీనామా లేఖను కలెక్టర్ నాగలక్ష్మికి పంపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ రాజీనామా లేఖకు సంబంధించి ఆమోదం తెలిపి ప్రభుత్వానికి పంపించేందుకు ఈ నెల 20న కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు కార్పొరేటర్లకు నోటీసులు జారీ చేసినట్లు కౌన్సిల్ సెక్రటరి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6.24 (సోమవారం సాయంత్రం)
సహరి: 4.58 మంగళవారం ఉదయం

మేయర్‌ను అధిష్ఠానం నిర్ణయిస్తుంది

- కావటి ఎందుకు రాజీనామా చేశారో తెలియదు
- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు కార్పొరేషన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర మేయర్ మనోహర్‌నాయుడు రాజీనామా నేపథ్యంలో నూతన మేయర్ ఎవరన్నది పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అధిష్ఠానం నిర్ణయించిన వారిని నూతన మేయర్‌గా ఎన్నుకుంటామన్నారు. ఇక కావటి మనోహర్‌నాయుడు తన పదవికి ఎందుకు రాజీనామా చేశారు తెలియదన్నారు. పత్రికల ద్వారానే రాజీనామా విషయం తనకు తెలిసిందన్నారు.

నాడు కబ్జా.. నేడు విక్రయం

- ప్రభుత్వం మారినా ఆగని దందా
- పోలీసులకు ఫిర్యాదు చేసినా దక్కని ఊరట
- ప్రైవేటు ప్లాట్లను ఆక్రమించుకున్న వైసీపీ నేత
- వైసీపీ హయాంలో యజమానులకు బెదిరింపులు



కైలాసగిరి కొండ వద్ద వైసీపీ నాయకుడు ఆక్రమించుకుని వేసిన వెంచర్

గుంటూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నాడు అధికారం అండతో యజమానులను బెదిరించి ప్లాట్లను ఓ వైసీపీ నేత ఆక్రమించుకున్నాడు. అయితే ప్రభుత్వం మారినా ఆ వైసీపీ నేత దందా యథేచ్ఛగా కొనసాగుతుండటంతో ఆయా ప్లాట్ల యజమానులు లబోదిబోమంటున్నారు. గుంటూరు మండలం నల్లపాడు సమీపంలోని కైలాసగిరి కొండ ప్రాంతంలో 20 ఏళ్ల క్రితం సర్వే నంబరు 580-2ఏలో సుమారు 2వందల ప్లాట్లతో లే అవుట్ వేశారు. యజమానులు స్థానికంగా లేకపోవడంతో ప్లాట్లపై పేరేచర్లకు చెందిన ఓ వైసీపీ నాయకుడు కన్నేశాడు. వైసీపీ అధికారంలోకి రాకముందు లేఅవుట్ సర్వే నంబరును చుక్కలు భూమిలో చేర్చారు. దీంతో ఆ లేఅవుట్‌లో క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక వైసీపీ నేత అది ప్రభుత్వ భూమి అంటూ ప్రచారం చేసి ఆక్రమించుకున్నాడు. కబ్జా విషయం తెలిసి వచ్చిన యాజమానులను బెదిరించాడు. వైసీపీ హయాంలో జరిపిన రీ సర్వేలో ఈ సర్వే నంబరును చుక్కలు భూమి నుంచి తప్పించి విక్రయాలు మొదలుపెట్టాడు. ఈ భూమి తన పూర్వీకులదని దస్తావేజులో పేర్కొని రిజిష్టర్ చేశాడు. ఎటువంటి పత్రాలు లేకపోయినా కేవలం ఇంటిపన్ను, కరెంటు బిల్ చూపి రిజిస్ట్రేషన్లు చేశాడు. ఒక్కో ప్లాటు 220 గజాలుండగా దానిని 8 లక్షల నుంచి పది లక్షల వరకు విక్రయించినట్లు సమాచారం. లింక్ దస్తావేజులు లేకపోయినా నల్లపాడు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఎటువంటి అభ్యంతరాలు లేకుండా రిజిస్ట్రేషన్లు జరిగిపోతున్నాయి. ఈ నేత ఆగడాలపై ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేక పోవడంతో బాధితులు మౌనంగా ఉండిపోయారు. అయితే ప్రభుత్వం మారినా ఇతడి దందా ఆగడం లేదని బాధితులు ప్రస్తుతం లబోదిబోమంటున్నారు. తాజాగా అతడి ఆగడాలపై ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని బాధితులు వాపోతున్నారు.

మామూళ్లు.. రిజిస్ట్రేషన్లు

అసలు దస్తావేజు లేకుండానే, భూమి హక్కుదారుల ఎవరన్నది చూడకుండానే రిజిస్ట్రేషన్ చేస్తుండటంపై అనుమానాలు వస్తున్నాయి. మామూళ్ల మత్తులో ఉన్న అధికారులు వీరికి సహకరించి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ లేఅవుట్ ప్రాంతానికి సమీపంలో అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు వస్తుండడంతో ధరలు పెరిగాయి. రిజిస్టర్ జరిగిన దస్తావేజులను పరిశీలిస్తే వైసీపీ నాయకుడి బాగోతం బయట పడుతుందని బాధితులు అంటున్నారు.

కర్ణాటక మిర్చి కట్టడి!

- వాటి వలనే ఇక్కడి రకాలకు ధర రావడం లేదని రైతుల భావన
- అక్కడి నుంచి ఎక్కువగా మిర్చిని తెప్పించడంలో వ్యాపారుల పాత్ర
- ఈ వారంలోనే మార్కెటింగ్ శాఖ నిర్ణయం తీసుకునే అవకాశం

6

మున్సిపాలిటీల్లో డిజిటల్ చెల్లింపులేవి..?

- కేవలం నగదు వసూళ్లే..

బగళాముఖి అమ్మవారి సన్నిధిలో జస్టిస్ రజని

పిట్టలవానిపాలెం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయానికి ఆంధ్రప్రదేశ్ ఉప లోకాయుక్త, న్యాయమూర్తి జస్టిస్ పి.రజని, వెంకటరత్నాకరరెడ్డి దంపతులు ఆదివారం విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సంబంధించి కార్యనిర్వహణాధికారికి లిఖితపూర్వకంగా అనేక సూచనలు చేశారు. మీ సూచనల



శ్రీ బగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ఉప లోకాయుక్త, న్యాయమూర్తి జస్టిస్ పి.రజని, వెంకటరత్నాకరరెడ్డి దంపతులు

ను ఉన్నతాధికారుల అనుమతితో తప్పనిసరిగా పాటిస్తానని ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు, బాపట్ల తహసీల్దార్ షేక్.సలీమా, పిట్టలవానిపాలెం తహసీల్దార్ ధూళ్ళిపూడి వెంకటేశ్వరరావు, పోలీసు, రెవెన్యూ, గ్రామపంచాయతీ అధికారులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప లోకాయుక్త, న్యాయమూర్తి జస్టిస్ పి.రజని దంపతులను ఆలయం తరపున దుశ్శాలువా, శేషవస్త్రంతో ఘనంగా సత్కరించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు.

విద్యార్థులకు టాబ్లెట్స్ విక్రయిస్తున్న మహిళ అరెస్టు



టాబ్లెట్స్‌ను స్వాధీనం చేసుకున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పీ గీతిక

బాపట్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం వెదుళ్ళపల్లి గ్రామం వృక్షనగర్‌లో అక్రమంగా విక్రయిస్తున్న టాబ్లెట్స్‌ను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.గీతికలు ఆదివారం పట్టుకున్నారు. సీఐ గీతిక తెలిపిన వివరాలు ప్రకారం... గ్రామంలో పోలా విజయలక్ష్మి అనే మహిళ విద్యార్థులకు టాబ్లెట్స్ విక్రయిస్తుందని సమాచారం వచ్చిందన్నారు. వైద్యులు వీటిని పెయిన్ కిల్లర్స్‌గా ఇస్తుంటారని, అయితే ఇక్కడ ఈ టాబ్లెట్స్ ఎక్కువగా వేసుకుంటే యువత మత్తులోకి వెళతారని చెప్పి విక్రయిస్తున్నారు. వీటిని వినియోగించటం వల్ల గుండెపోటు కూడా వచ్చే ప్రమాదం ఉందని చెప్పారు. ఏవిధమైన అనుమతులు లేకుండా విద్యార్థులకు వీటిని విక్రయిస్తున్నట్లు గుర్తించి ఆమె వద్ద ఉన్న 1600 టాబ్లెట్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రభుదాసు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ టాబ్లెట్స్‌ను డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించారు.



ఉడుతకే... సాయం

తెనాలి, మార్చి 16, (ఆంధ్రజ్యోతి): సాక్షాత్తు శ్రీరాముడికే లంకకు వారధి కట్టే విషయంలో సాయం అందించిన ఉడుతకు ఇక్కడ ఓ జంతు ప్రేమికుడు సాయమందించాడు. అతను చేసిన సాయానికి కృతజ్ఞతగా ఆ రెండు ఉడుత పిల్లలు అతనిని వదలకుండా అతనిపైకే ఎక్కి ఆడుకోవటం, తోలినా వెళ్లకుండా చుట్టూ తిరుగుతుండటం చూపరులను ఆశ్చర్యానికి గురిచేసింది. తెనాలిలోని జంతు ప్రేమికుడు తన్నీరు శివశంకర్‌కు సామాజిక సేవకుడు, జంతు ప్రేమికుడుగా మంచి పేరుంది. ఆదివారం తన దుకాణం దగ్గర బయట కూర్చుని ఉంటే, రెండు ఉడుత పిల్లలు తన చుట్టూ తిరగటం గమనించాడు. తల్లి కనిపించకపోవటం, అవి ఆకలితో ఉన్నట్టు గుర్తించి పాలు కొనితెచ్చి, ఒక సిరంజ్‌తో పాలు పట్టి వాటికి అందించాడు. అయితే అవికూడా అంతే ఆకలితో సిరంజ్‌ను పట్టుకుని వదలకుండా పాలన్నీ తాగేయటం చూస్తే వాటి ఆకలి ఒకింత బాధను కలిగించింది. అయితే పాలు తాగిన తర్వాత వెళ్లిపోకుండా ఆ రెండు ఉడుత పిల్లలు అతని చుట్టూనే తిరుగుతూ ఉండిపోయాయి.





ఉడుతలకు సిరంజీతో పాలుపడుతున్న శివశంకర్

ఇక మొదలెడదామా...!

- సెలవులు ఇవ్వకుండానే ఇంటర్ తరగతులు
- 24 నుంచి తరగతులని ఆదేశాలు
- అనధికార అడ్మిషన్ టెస్టులు మొదలు

గుంటూరు (విద్య) మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ముగిసి వారం రోజులు కాకుండానే ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభించేందుకు ప్రైవేట్ కళాశాలలో ప్రయత్నాలు ప్రారంభించాయి ఇప్పటికే విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లిదండ్రుల ఫోన్లకు సమాచారం పంపి తరగతులకు పంపించాలని ఒత్తిడి తెస్తున్నాయి. ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు ఈనెల ఒకటి నుంచి ప్రారంభమై ఈనెల 13తేదీతో ముగిశాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 65 వేల మంది విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు ముగిసి వారం రోజులు కాకుండానే ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయని సమాచారం పంపడంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. సంవత్సరం మొత్తం తీవ్ర ఒత్తిడి మధ్య చదివిన విద్యార్థులకు కనీసం నెలరోజులు కూడా సెలవులు ఇవ్వకపోవడంతో వారు మానసికంగా కుంగుబాటుకు గురి అవుతున్నారు. దీనికితోడు ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో తరగతులు ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై సాయంత్రం 8 గంటల వరకు నిర్వహిస్తారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. కనీసం సెలవు రోజుల్లో కూడా వారిని వదలకుండా క్లాసులు నిర్వహించడం మరింత ఆందోళన పరిచే విషయం.

అనధికార టెస్టులకు రంగం సిద్ధం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు అడ్మిషన్ల కోసం ఎటువంటి టెస్టు నిర్వహించరాదు. అయితే కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు టెస్టులు నిర్వహించి తమ సంస్థల్లో అడ్మిషన్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ఈ విషయం గురించి ఇంటర్ బోర్డు, పాఠశాల విద్యాశాఖ అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నా రనే ఆరోపణలు ఉన్నాయి.

ఇప్పుడు క్లాసులు నిర్వహిస్తే, ఒక వైపు మండే



ఇటీవల పరీక్షలు పూర్తిచేసుకుని వస్తున్న ఇంటర్ విద్యార్థులు

ఎండలు, మరోవైపు తరగతి గదుల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతారు. రెగ్యులర్‌గా ఇంటర్ తరగతులు ప్రారంభం అయ్యే నాటి కి దాదాపు సగం సిలబస్ పూర్తి అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేశా ర ని, దీంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని ఓ కార్పొరేట్ కళాశాలలో పనిచేసే అధ్యాపకుడు ఆందోళన వ్యక్తం చేశాడు. ఇంకోవైపు తరగతులకు పంపకపోతే "మీ పిల్లలు చదువులో వెనుకబడిపోతారని" తల్లిదండ్రులను మానసికంగా బ్లాక్ మెయిల్ చేసేస్థాయికి ప్రైవేటు,కార్పొరేట్ కళాశాలలు చేరాయి. ఇప్పటికైనా ఇంటర్ బోర్డు అధికారులు ఇటువంటి వాటిపై దృష్టి సారించాలని విద్యార్థి సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

'సాయి సాధన' బాధితుల వాంగ్మూలం నమోదు

నరసరావుపేట లీగల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి), భారీగా డిపాజిటర్లను, చిట్ చందాదారులను మోసగించిన కేసులో సాయి సాధన చిట్‌ఫండ్ నిర్వాహకుడు పాలడుగు పుల్లారావుపై నమోదైన కేసుల దర్యాప్తు వేగం పుంజుకుంది. అధికారికంగా 500మంది బాధితులు ఇప్పటివరకు తేలారు. వీరిలో ఇప్పటివరకు 300మంది తమ వాంగ్మూలాలను సంబంధిత అధికారులకు అందజేశారు. గత మూడు రోజులుగా నరసరావుపేట మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్లో మకాంవేసిన సిట్ బృందానికి 100మంది బాధితులు తమ వాంగ్మూలాలను ఇచ్చినట్లు సమాచారం. అధికారికంగా చిట్‌ఫండ్ చందాదారులకు 47 కోట్ల రూపాయల మేరకు బకాయి ఉందని, పుల్లారావుకు రావాల్సిన నగదు రూ.12కోట్ల మేరకు ఉన్నట్లు సమాచారం. బాధితులు ఈ విషయమై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును, మంత్రి లోకేశ్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వడంతో.. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం కేసు దర్యాప్తునకు ఐపీఎస్ వకుల్‌జిందాల్ అధ్యక్షతన సిట్‌ను ఏర్పాటుచేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు యావత్తు సిట్ బృందం చేతికి చేరింది. సిట్ బృందం మూడు విభాగాలుగా కేసును అన్నికోణాల్లో క్షుణ్ణంగా దర్యాప్తు చేసి, డిపాజిటర్ల సొమ్ము తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకుంటోంది. కాగా ముందస్తు బెయిల్ కోసం పుల్లారావు కుటుంబ సభ్యులు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్ ఈ నెల 17వ తేదీన విచారణకు రానుంది.

కర్ణాటక మిర్చి కట్టడి!

- వాటి వలనే ఇక్కడి రకాలకు ధర రావడం లేదని రైతుల భావన
- అక్కడి నుంచి ఎక్కువగా మిర్చిని తెప్పించడంలో వ్యాపారుల పాత్ర
- ఈ వారంలోనే మార్కెటింగ్ శాఖ నిర్ణయం తీసుకునే అవకాశం

గుంటూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఇబ్బడిముబ్బడిగా గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు)ని ముంచెత్తుతోన్న కర్ణాటక రాష్ట్ర మిర్చిని కొంతమేరకు కట్టడి చేయాలని మార్కెటింగ్ శాఖ భావిస్తున్నది. మార్కెట్‌కి నిత్యం రైతులు తీసుకొస్తున్న లక్షా 30 వేలకు పైగా మిర్చి టిక్కీల్లో 50 శాతం వరకు ఆ రాష్ట్రానికి చెందిన రైతులు తీసుకొస్తున్నవే ఉంటున్నాయి. పైగా అవి అధిక తేమ శాతంతో కూడుకుని ఉంటుండటంతో వ్యాపారస్థులు ధర పెంచడం లేదు. ఆ మిరపకాయలను కోల్డ్‌స్టోరేజ్‌లలో కూడా నిల్వ చేయలేని పరిస్థితి ఉండటంతో వ్యాపారస్థులు నిర్ణయించిన ధరకు విక్రయిస్తున్నారు. దీంతో ఉమ్మడి కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి రైతులు తీసుకొస్తున్న మిర్చికి కూడా ధర రావడం లేదు.

ప్రస్తుతం మిర్చియార్డుకు ఎక్కువగా కర్ణాటక రాష్ట్రంలోని బళ్ళారి, హుబ్లీ, హోస్‌పేట తదితర ప్రాంతాల నుంచి రైతులు మిర్చిని ఎక్కువ మోతాదులో తీసుకొస్తున్నారు. వీళ్లతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ చుట్టుపక్కల నుంచి కూడా రైతులు మిర్చిని ఇక్కడికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఇందుకు కారణం ఆయా రాష్ట్రాలతో పోల్చితే ఇక్కడ వ్యాపారస్థులు ఎక్కువ సంఖ్యలో ఉండటం, మిర్చిని అమ్మిపెట్టిన రోజునే నగదుని వాళ్ల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుండటమే. అయితే ప్రస్తుతం అక్కడి రైతులు మూడో కోత మిరపకాయలను తీసుకొస్తు న్నారు. సరిగా ఆరబెట్టకుండా తెచ్చేస్తున్నారు. అలానే వాటిల్లో తాలుకా యల శాతం కూడా ఎక్కువగానే ఉంటున్నది. ఈ మిర్చి టిక్కీలను విప్పి చూస్తూనే ఎక్స్‌పోర్టర్లు ధర తగ్గించేస్తున్నారు. అలానే బంగ్లాదేశ్‌లో రంజాన్ పండగ కారణంగా అక్కడి నుంచి దిగుమతి ఆర్డర్లు తక్కువగా ఉంటున్నాయని మిర్చి కమీషన్ వ్యాపారి పమిడి కృష్ణ తెలిపారు.

వారంలో ఐదు రోజులు మాత్రమే వాణిజ్యం జరిగే



గుంటూరు మిర్చియార్డులో వ్యాపారస్థుల అంచనా ప్రకారం కర్ణాటక నుంచి లక్షన్నర టిక్కీల వరకు వస్తున్నాయి. తెలంగాణ నుంచి 15 వేల టిక్కీల వరకు వస్తున్నట్లు చెబుతున్నారు. వీటి ప్రభావం మార్కెట్‌పై గణనీయంగా ఉంటున్నది. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల నుంచి మిర్చిని ఏప్రిల్ మొదటి వారం వరకు కట్టడి చేయాలని మార్కెటింగ్ అధికారులు భావిస్తున్నారు. కోత జరిగిన తర్వాత కనీసం మూడు వారాల పాటైన ఎండబెట్టుకుని తీసుకురావాలని కోరేందుకు సిద్ధమయ్యారు. దీనివలన ఇక్కడి మిర్చి రకాలకు డిమాండ్ పెరిగి ధర క్వింటాల్ రూ. 15 వేలు దాటిపోతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం తేజ రకం మిర్చికి రూ. 11,500 మాత్రమే లభిస్తున్నది. టాప్ క్వాలిటీ అయితే రూ. 13 వేలు వస్తున్నది. మిగిలిన రకాలకు రూ. 9,500 నుంచి రూ. 11,500 వరకే ధర లభ్యమౌతున్నది.

ఐక్య పోరాటాలకు సమాయత్తం కావాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

గుంటూరు(తూర్పు), మార్చి 16(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాలు, కష్టజీవులు, వ్యవసాయ కార్మికులు, చేతివృత్తుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పిలుపునిచ్చారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో ఆది, సోమవారం రెండు రోజుల పాటు జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాల్లో రామకృష్ణ ప్రసంగించారు. దేశంలో పేదరికాన్ని తగ్గించే ఎటువంటి చర్యలు కనబడటం లేదన్నారు. వ్యవసాయ కార్మికులు కోట్లాది మంది ఉన్నారని, వారికి 200 పనిదినాలు కల్పించాలని, దానికి బడ్జెట్లో రూ.4.50 లక్షల కోట్లు కేటాయింపులు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నప్పటికీ కేవలం రూ.85 వేల కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. సంక్షేమ కార్యక్రమాలకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించడంతో పాటు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం అంటూ పాలనను నిర్లక్ష్యం చేస్తున్నాడని విమర్శించారు. 'ఉపాధి హామీ పథకం అమలు-అడ్డంకులు-మన కర్తవ్యం', గ్రామీణ కష్టజీవులు-సంక్షేమం అభివృద్ధి- సామాజిక న్యాయం' అనే అంశాలపై లిఫ్టిక్ సంస్థ డైరెక్టర్ చక్రధర్ బుద్ధ, డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ కిరణ్ కుమార్ మాట్లాడారు. సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీహెచ్ ప్రభాకర్, ఆవుల శేఖర్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జంగాల అజయ్‌కుమార్, కాబోతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కే రామకృష్ణ, పాల్గొన్న సీపీఐ నాయకులు

సబ్‌జైళ్లలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి తనిఖీలు

సౌకర్యాలు, ఆహార పదార్థాల నాణ్యత పరిశీలన



సత్తెనపల్లి సబ్ జైలును తనిఖీ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

సత్తెనపల్లి, గురజాల లీగల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి, గురజాల సబ్‌జైళ్లను ఆదివారం గుంటూరు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి తనిఖీ చేశారు. ఆయా జైళ్ల పరిసరాలను పరిశీలించి, రిమాండ్‌లో ఉన్న ఖైదీలతో మాట్లాడారు. సత్ ప్రవర్తనతో మెలగాలని వారికి సూచించారు. ఆర్థిక స్థోమత లేక న్యాయ సహాయం అవసరమైన నిందితులకు ఉచితంగా అందిస్తామన్నారు. జైళ్లలో ఉన్న సౌకర్యాలను, ఆహారం, సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జియావుద్దీన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి వీ విజయకుమార్‌రెడ్డి, ప్రధాన సివిల్ జడ్జి కౌషిత్ హుస్సేన్, ప్యానల్ న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావు, సత్తెనపల్లి సబ్ జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నం, గురజాల సబ్‌కోర్టు న్యాయమూర్తి వై శ్రీనివాసరావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి పీ అలేఖ్య, జైలు విజిటింగ్ న్యాయవాది కలివెల ప్రభుదాసు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం శ్రీనివాసరెడ్డి, న్యాయవాది చెన్నకేశవరావు, సబ్‌జైలు సూపరింటెండెంట్ అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో డిజిటల్ చెల్లింపులేవి..?

కేవలం నగదు వసూళ్లే....

గుంటూరు కార్పొరేషన్, తెనాలి అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మున్సి పల్, కార్పొరేషన్ కార్యాలయాల్లో ఆస్తి పన్ను చెల్లింపులకు కౌంటర్‌లలో కేవలం నగదు మాత్రమే స్వీకరిస్తున్నారు. పన్నుల చెల్లింపులో పలు శాఖలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలను, మొబైల్ ఫోన్ ద్వారా గూగుల్ పే, ఫోన్ పే సౌలభ్యాలు ఉన్నప్పటికీ వాటిని చెల్లింపు దారులకు అందుబాటులోకి తేవడంలో మున్సిపల్ శాఖ విఫలమైంది. గతంలో ఉన్న పుర సేవా యాప్ కూడా తొలగించారు. ఈ యాప్ ద్వారా పన్ను చెల్లించడంతో పాటు గతంలో చెల్లించిన వివరాలు, రశీదులు కూడా లభ్యమయ్యేవి. ఆన్‌లైన్‌లో సీడీఎంఏ పేమెంట్ విభాగం ఉన్నప్పటికీ సక్రమంగా పని చేయడం లేదంటున్నారు. కేవలం నగదు మాత్రమే కౌంటర్‌లలో తీసుకుండటంతో వడ్డీ ఎంతో తెలియక తక్కువ తీసుకు వెళ్లే చెల్లింపుదారులు నగదు కోసం మళ్లీ ఏటీఎంల వద్దకు వెళ్లాల్సి వస్తోంది.

రాష్ట్రంలోని నాలుగో పెద్ద నగరంగా పేరుపొందిన గుంటూరు నగర పాలక సంస్థ కూడా ఆ దిశగా అడుగులు వేయడం లేదు. దీంతో గుంటూరు పట్టణ ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గుంటూరు మార్కెట్ వద్ద గల ప్రధాన కార్యాలయం, బృందావన్ గార్డెన్స్‌లోని సర్కిల్ కార్యాలయం వద్ద మాత్రమే ఆస్తి పన్ను చెల్లించేందుకు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆ కౌంటర్ల వద్ద ఆస్తిపన్ను చెల్లింపు దారులు గంటలకొద్దీ క్యూ లైన్‌లో వేచి ఉండి పన్ను చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాదు వేసవిలో వడదెబ్బ ఇబ్బంది కూడా లేకపోలేదు.

జీఎంసీ కౌంటర్లలో పనిచేస్తున్న సిబ్బంది గతంలో పన్ను చెల్లింపు దారులకు నకిలీ రసీదులిచ్చి, ఆ నగదును స్వాహా చేసిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలను నగదు చెల్లింపులకు అందుబాటులోకి తేవాలని చెల్లింపుదారులు కోరుతున్నారు.

నేడు ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగుల విధుల బహిష్కరణ

గుంటూరు మెడికల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులు తమ ప్రధాన సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా విధులు బహిష్కరిస్తున్నట్లు ఏపీ వైద్యసేవ ఎంప్లాయీస్ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమారి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం విధులు బహిష్కరించి జిల్లా సమన్వయ అధికారి కార్యాలయం దగ్గర శాంతియుత నిరసన తెలియజేస్తున్నామన్నారు.

ఉద్యమ బాటలో.. ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం

- రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కారరావు వెల్లడి

గుంటూరు మెడికల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ 28 ఆర్థికేతర అంశాలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ త్వరలో ఉద్యమబాట పడుతున్నట్లు ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ ఆస్కారరావు ప్రకటించారు. కలెక్టరేట్ పక్కన గల డ్రైవర్స్ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం జరిగిన ఏపీ ప్రజారోగ్య వైద్య



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కారరావు

ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆస్కారరావు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించాలని గతంలో పలుసార్లు ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా తెలియజేసినా నేటికి ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. త్వరలో తమ సంఘం తరఫున ప్రభుత్వానికి సమ్మె నోటీసు జారీ చేసి, 15 రోజుల తర్వాత దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ టీడీకే సాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే అహోరేన్, ముఖ్య సలహాదారు ఎస్వీ రమణ, కోశాధికారి ఎస్ బాబా సాహెబ్, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, కృష్ణారెడ్డి, సయ్యద్ చాంద్ బాషా, దుర్గా ప్రసాద్, సత్యనారాయణబాబు, అపరంజమ్మ, శేష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించి వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్ణయించారు.

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి



వెంకటసత్యం (ఫైల్)

వెల్దుర్తి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఆదివారం జరిగింది. మండలంలోని గుండ్లపాడుకు చెందిన ఉప్పుతోళ్ల వెంకటసత్యం (23), మంజుల నవీన్, మణికంఠలు మండలంలోని ఉప్పలపాడు నుంచి ద్విచక్ర వాహనంపై వెల్దుర్తి వస్తున్నారు. వెల్దుర్తిలోని కళ్యాణ మండపం వద్ద బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో వెంకటసత్యం అక్కడికక్కడే మృతిచెందగా నవీన్, మణికంఠలకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వెల్దుర్తి పోలీసులు వెంకటసత్యం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్లలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 519.20 అడుగులు ఉంది. ఇది 147.82 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8454 క్యూసెక్కులు, ఎస్ఎ ల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 18,277 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	91, 99, 110
చికెన్ విత్ స్కిన్(కిలో)	176.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	186.00

గుంటూరుకి ఐకానిక్‌గా పీవీకే నాయుడు మార్కెట్

- వ్యాపారులకు ఏ విధమైన సమస్యలు లేకుండా చూస్తా
- కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- మార్కెట్ నూతన నమూనాపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- నగరంలో వ్యాపారులు, స్టేక్ హోల్డర్స్‌తో ప్రత్యేక సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని, కమిషనర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే మాధవి, డిప్యూటీ మేయర్ సజీల

గుంటూరు కార్పొరేషన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరానికి ఐకానిక్‌గా నిలిచేలా, ప్రస్తుతం వ్యాపారాలు చేస్తున్న వారికి ఏ విధమైన సమస్యలు లేకుండా పీవీకే నాయుడు మార్కెట్‌ని అధునాతనంగా నిర్మాణం చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ జీఎంసీ అధికారులను ఆదేశించారు. ఆదివారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, అధికారులతో కలిసి పీవీకే నాయుడు మార్కెట్‌ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అనంతరం జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో మార్కెట్ వ్యాపారులు, సంఘాల ప్రతి నిధులు, అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ పీవీకే నాయుడు మార్కెట్ నిర్మాణం ఏ విధానంలో జరిగినా అధునాతన వసతులు, జీఎంసీ పై ఆర్థికభారం లేకుండా, ప్రస్తుతం అక్కడ ఉన్న వ్యాపారులకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. వ్యాపారులు మార్కెట్ నిర్మాణంపై అపోహలు నమ్మొద్దని, ప్రజాప్రతినిధులు, జీఎంసీ అధికారులు అందుబాటులోనే ఉంటారని, ఏ సమస్య ఉన్నా పరిష్కరించుకుందామని తెలిపారు. నగరంలో యూజీడీ పనుల కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 వందల కోట్లలో రూ.350 కోట్లు ఖర్చు చేసి, రూ.150 కోట్లు ఇతర రంగాలకు మళ్లించారని, కనుక ఇక కేంద్రం యూజీడీ కోసం నిధులు మంజూరు చేయదన్నారు. మార్కెట్ నిర్మాణం అనంతరం తగిన ఆదాయం వచ్చేందుకు ఆయా ఫ్లోర్‌లు అద్దె ప్రాతిపదికన ఇచ్చేలా ముందస్తుగానే ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, వ్యాపార సంస్థలతో అగ్రిమెంట్ తీసుకుంటే మంచిదన్నారు. షుమారు 2 ఎకరాల విస్తీర్ణంలో మార్కెట్, పక్కనే ప్రస్తుతం ఉన్న జీఎంసీ కార్యాలయం స్థానంలో నూతన భవనం నిర్మాణాలు చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా చర్చించి, ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

తొలుత పీవీకే నాయుడు మార్కెట్‌ని పరిశీలించి, వ్యాపారులతో మాట్లాడి, వారి అభిప్రాయలు తెలుసుకొన్నారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమిషనర్ పవర్ పాయింట్ ప్రజెంటే షన్ ద్వారా ప్రస్తుతం మార్కెట్‌లో వ్యాపారుల వివరాలు, ఇప్పటివరకు రూపొందించిన డిజైన్‌ని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, టీడీపీ ఫ్లోర్ లీడర్ కోవెలమూడి రవీంద్ర, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకటకృష్ణయ్య, వివిధ డివిజన్ల కార్పొ రేటర్లు, పీవీకే నాయుడు మార్కెట్ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జీవితం నేటి తరానికి ఆదర్శనీయం

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని


పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే మాధవి తదితరులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం ప్రాణ త్యాగానికి వెనుకాడని పొట్టి శ్రీరాములు జీవితం నేటి తరానికి ఆదర్శమని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా హిందూ కాలేజీ జంక్షన్‌లోని ఆయన విగ్రహానికి నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, ప్రజాప్రతినిధులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పెమ్మసాని మాట్లాడు తూ తెలుగువారి ఆత్మగౌరవానికి పొట్టి శ్రీరాములు చిహ్నంగా ఉంటారన్నారు. కార్యకమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాముల అడుగుజాడల్లో నడుద్దాం: మద్దిరాల

గుంటూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు అడుగుజాడల్లో నడ వాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మద్దిరాల ఇమ్మానియేల్(మ్యాని) అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివా రం పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్య క్రమంలో కసుకుర్తి హనుమంతరావు, కంచర్ల శివరామయ్య, కార్పొరేటర్ ఈరంటీ వర ప్రసాద్‌బాబు, మర్రిపాటి శ్రీనివాస్, వడ్డే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసీపీ నేతల నివాళులు

బృందావన్‌గార్డెన్స్‌లోని వైసీపీ జిల్లా కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయం తి కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాం బాబు, నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా పలువురు నాయకులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు.


కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న సుధామైథిలి, రంగారావు తదితరులు

ప్రకృతి కవిత్వం పరవశింపజేస్తుంది

- డాక్టర్ ఎన్‌సీహెచ్ సుధామైథిలి

గుంటూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ప్రకృతి కవిత్వం పరవశింప చేస్తుందని సాహిత్య విశ్లేషకురాలు నల్లాన చక్రవర్తుల సుధా మైథిలి తెలియజేశారు. 'అమరావతి సాహితీ మిత్రులు' ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమా వేశ మందిరంలో నిర్వహించిన సాహిత్య సభలో ఆమె 'ప్రకృతి చిత్రణ కవులు' అనే అంశంపై ప్రసంగించారు. ప్రకృతి కవిత్వం మనసును సున్నితంగా మారుస్తుందని, ఆధునిక సమాజంలోని అనేక రుగ్మతలకు ఔషధంగా ప్రకృతి కవిత్వ ఆస్వాదన పనికి వస్తుందని అభిప్రాయపడ్డారు. దేవులపల్లి, రాయప్రోలు, నండూరి, సినారె, దాశరథి, కరుణశ్రీ మొద లైన కవులు ఆయా సందర్భాల్లో రాసిన ప్రకృతి చిత్రణ కవిత్వం వినిపించి భావ సౌందర్యాన్ని తెలియజేశారు. శరకణం కనకదుర్గ అధ్యక్షత వహించిన ఈ సభలో పెనుగొండ లక్ష్మీ నారాయణ రచించిన 'విశేష' వ్యాసాల సంపుటిని సంస్థ అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు సమీక్షించారు. గోలి హనుమచ్ఛాస్త్రి, వక్కలగడ్డ వెంకటేశ్వరరావు, షేక్ కాసింబి, పి.శివ శంకరరావు, మేడిశెట్టి సుభద్రా కృష్ణ, లంక మాధవి, యర్రగుంట్ల పాణిరావు, గడల శివ ప్రసాద్, షేక్ జానీబాషా, చల్లా సత్యవతి (పిడుగురాళ్ల), బీ సుబ్రహ్మణ్యం (మంగళగిరి), మస్తాన్ బాబు (మేడికొండూరు)తదితరులు పాల్గొన్నారు.

ఎంపీహెచ్ అసిస్టెంట్లను కాంట్రాక్టు పద్ధతిలోకి తీసుకురావాలి

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానికి ట్రేడ్ యూనియన్ విజ్ఞప్తి

గుంటూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగాలు చేస్తున్న సిబ్బందిని కాంట్రాక్ట్ విధానంలోకి తీసుకురావాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మద్దిరాల జోసెఫ్ ఇమ్మానియేల్ కోరారు. ఆదివారం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ని ఆయన కార్యాలయంలో మ్యానీ ఆధ్వర్యంలో ట్రేడ్ యూనియన్ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మూడు నెలల క్రితం కలెక్టర్ కార్యాలయంలో నగరపాలక సంస్థలోని అన్ని యూనియన్ల నాయకులు, పీఎఫ్ కార్యాలయం, యూనియన్ బ్యాంకు అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి కార్మికులకు ఉన్న పీఎఫ్ ఈఎస్ఐ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారని చెప్పారు. అదేవిధంగా బ్యాంకు తక్షణమే ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ వ్యక్తిగత రుణాలు మంజూరు చేయాల్సిందిగా ఆదేశించారని, అయితే ఇప్పటివరకు నగరపాలక సంస్థలోని 3,000 మంది కార్మికులలో ఒక్కరికి కూడా యూనియన్ బ్యాంకు రుణం మంజూరు చేయలేదని చెప్పారు. దీనిపై మంత్రి పెమ్మసాని వెంటనే స్పందించి బ్యాంకు అధికారులతో తాను మాట్లాడి సమస్యని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మధుబాబు, కమిటీ సభ్యుడు పసుపులేటి నాగేశ్వరరావు, కిషోర్, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు అదనపు పెన్షన్ చెల్లించే విధానం

గుంటూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పెన్షనర్లకు అదనపు పెన్షన్ చెల్లించే విధానం గురించి రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్ నుంచి ఎటువంటి విజ్ఞప్తి లేకుండా అంతర్జాలంలో నిక్షిప్తమైన పుట్టినతేదీ ఆధారంగా 70 సంవత్సరాలు వయస్సు నిండిన వెంటనే 7 శాతం అదనపు పెన్షన్ చెల్లిస్తారు. 75 నుంచి 80 సంవత్సరాల వరకు 12 శాతం అదనపు పెన్షన్ చెల్లిస్తారన్నారు. 80 నుంచి 85 సంవత్సరాల వరకు బేసిక్ పెన్షన్‌పై 20 శాతం అదనంగా పెన్షన్ చెల్లిస్తారని తెలిపారు. 85 నుంచి 90 సంవత్సరాల వరకు బేసిక్ పెన్షన్‌పై 25 శాతం అదనంగా పెన్షన్ చెల్లిస్తారని, 90 నుంచి 95సంవత్సరాల వరకు బేసిక్ పెన్షన్‌పై 30 శాతం అదనపు పెన్షన్ చెల్లిస్తారు. 95 నుంచి 100 సంవత్సరాల వరకు బేసిక్ పెన్షన్ పై 35 శాతం అదనపు పెన్షన్ చెల్లిస్తారు. 100 సంవత్సరాల పైన బేసిక్ పెన్షన్‌పై 50 శాతం అదనపు పెన్షన్ చెల్లిస్తారని వివరించారు. పై మొత్తాలన్నీ కుటుంబ పెన్షనర్లకు కూడా వర్తిస్తాయని పేర్కొన్నారు. ఈ అదనపు పెన్షన్‌పై కరువు భత్యం కూడా లెక్కించి చెల్లిస్తారని, వయసు పెరిగే కొద్ది పెన్షనర్లకు ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఉత్పన్నమవుతాయనే దృష్టితో అదనపు పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టారని వీరయ్య తెలిపారు.

ఓర్పు, సమానత్వం, త్యాగానికి ప్రతీక రంజాన్

- మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి

గుంటూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఓర్పు, సమానత్వం, త్యాగానికి ప్రతీక రంజాన్ అని మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని బారా యిమాం పంజాలోనున్న కార్యాలయంలో తూర్పు నియోజకవర్గంలోని పలువురు పేద ముస్లింలకు మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావుల చేతుల మీదుగా రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాణిక్యవరప్రసాద్, లింగంశెట్టి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో పేద ముస్లింలకు రంజాన్‌తోఫా పంపిణీ చేయటం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో వైసీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా, న్యాయవాది ఉమాశంకర్, జిల్లా ఖాజీ ముఫ్తీ జావిద్, షేక్ షరీఫ్, ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీముల్లా తదితరులున్నారు.


రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న మాణిక్యవరప్రసాద్, లింగంశెట్టి, మస్తాన్‌వలి తదితరులు

దేశవ్యాప్త ఆందోళనలను జయప్రదం చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి


మాట్లాడుతున్న దయా రమాదేవి

గుంటూరు(తూర్పు), మార్చి 16(ఆంధ్రజ్యోతి): లేబర్‌కోడ్స్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తం గా జరగనున్న ఆందోళన కార్యక్రమాల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పాత గుంటూరులోని యూనియన్ జిల్లా కౌన్సిల్ సమావేశం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దయా రమాదేవి మాట్లాడుతూ రైతులు, కార్మిక పోరాటాల వల్ల తాత్కాలికంగా అమలు ఆగిన లేబర్ కోడ్స్ ఏప్రిల్ నుంచి అమల్లోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ముమ్మర ప్రయత్నం చేస్తుందని అన్నారు. దీనిని ఐక్యంగా కార్మిక ఉద్యమం అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అఖిల భారత కార్మిక సంఘాలు ఏప్రిల్, మే నెలలో లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా దశల వారి పోరాటం, జాతీయ సార్వత్రిక సమ్మెను జరిపేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారని వివరించారు. సమావేశంలో వై నేతాజీ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా కార్యవర్గ ఎన్నిక

స్థానిక పాత గుంటూరు సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడుగా బీ లక్ష్మణరావును, జిల్లా ప్రధాన కార్యదర్శిగా దండా లక్ష్మీనారాయణ ఎన్నుకున్నా రు. వీరితోపాటు జిల్లా ఉపాధ్యక్షుడిగా సీహెచ్ నాగ బ్రహ్మాచారి, కే బాబుప్రసాదు, జిల్లా కార్యదర్శులుగా వై నేతాజీ, వై రమణలను ఎన్నుకొన్నారు.

వృద్ధులకు పెన్షన్ పంపిణీ

గుంటూరు(తూర్పు), మార్చి 16(ఆంధ్రజ్యోతి): అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా వాసవీక్లబ్ గుంటూరు, మహిళా, యువ క్లబ్స్ ఆధ్వర్యంలో స్థానిక కన్యాకపరమేశ్వరి ఆలయంలో పేదలకు ఉచిత బియ్యం, వృద్ధులకు పెన్షన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు తడవర్తి రాంబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఆలయ ఆవరణలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైభవంగా ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు


మూలవిరాట్‌లకు పుష్పాలతో అభిషేకం చేస్తున్న శ్రీవిద్యారణ్య భారతిస్వామి

గుంటూరు (తూర్పు), మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్ పేట, శ్రీ అష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో జరుగుతు న్న 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశా యి. చివరి రోజున ఆది వారం శ్రీలక్ష్మీ, నారాయణు ల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం హంపీ పీఠాధీ శ్వరులు శ్రీవిద్యారణ్య భారతీ స్వామి ఆధ్వర్యంలో కల్యాణమూర్తులకు వివిధ రకాల పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేకంగా తులసితో కనుల పండువగా అభిషేకార్చన, శాంతి హోమం పూర్ణాహుతి ద్రవ్యాలకు పూజ నిర్వహించి మహా పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమాల్ని ప్రధాన అర్చకులు ప్రసాద్ శర్మ, ధర్మకర్త మర్రిపాటి పార్థసారథి పర్యవేక్షించారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ సేవ

గుంటూరు(తూర్పు), మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ అగ్రహారం శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో 29వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్స వాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, విశేష పూజలు, నిత్య హోమాలు, బలిహరణ తదితర కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం అర్చకులు సహస్ర దీపాలంకరణ సేవను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమాల్ని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ తదితరులు పర్యవేక్షించారు.


స్వామి వారికి సహస్ర దీపాలంకరణ సేవ చేస్తున్న అర్చకులు

అలరించిన భక్తి సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక దేవాపురం, శ్రీఅభయ ఆంజ నేయ స్వామి ఆలయంలో స్వామి వారి వార్షికోత్సవం సందర్భంగా స్వరరాగ సుధా ఆధ్వ ర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకులు కేవీ సాయిబాబా శర్మ, ఆర్‌పీఎల్ నరసింహారావు పలు భక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీ బోర్డుపై రామ కృష్ణ, తబలాపై షణ్ముఖశర్మ వాయిద్య సహకారం అందించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

వైభవంగా శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ల

గుంటూరు(తూర్పు), మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కొరిటెపాడు, అంజనేయపేటలో కొలువైన శ్రీలక్ష్మీ తిరుపతమ్మ - గోపయ్య స్వాముల వారి తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, శ్రీలక్ష్మీనారాయణ హోమం జరిగాయి. సాయంత్రం ఆలయ నిర్వాహకులు సువాసినులకు పసుపు, కుంకుమ, గాజులు అందజేసే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలను ఆల య నిర్వహకులు కన్నసాని విజయకుమార్(రాజా), రవికుమార్, బాజీ తదితరులు పర్య వేక్షించారు.

వివాహిత ఆత్మహత్య

- భర్త, అత్తింటి వేధింపులే కారణమని తల్లిదండ్రుల ఫిర్యాదు

గుంటూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ద్వారకా నగర్ ఏడోలైన్‌కి చెందిన కొప్పుల గీతిక (19) అనే వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్‌కు చెందిన గీతిక కుటుంబం హైదరాబాదులోని ఓల్డ్ బోయిన పల్లిలో నివాసం ఉంటుంది. అయితే గీతికకు అమరావతిరోడ్‌లోని ద్వారకానగర్ చెందిన కొప్పుల సాయి అనే యువకుడు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం అయ్యాడు. ఇద్దరు ప్రేమించుకున్నారు. గత ఏడాది సెప్టెంబరులో పెళ్లి చేసుకున్నారు. వివాహమైన కొద్ది రోజు లకు అదనపు కట్నం కోసం తమ కుమార్తెను వేధిస్తుండటంతో ఆమె ఇచ్చిన సమాచారంతో గత ఫిబ్రవరిలో ఆమె తల్లిదండ్రులు గుంటూరు వచ్చి వారికి బట్టలు పెట్టి మూడు లక్షల నగదు ఇచ్చి వెళ్లినట్లు వారు తెలిపారు. అయినప్పటికీ ఇంకా అదనపు కట్నం కావాలని గతం లో తన కుమార్తె ధరించిన బంగారు ఆభరణాలన్నీ కావాలంటూ వేధింపులు ప్రారంభించారన్నారు. ఈ విషయం కూతురు తమకు చెప్పగా తాను అల్లుడికి ఫోన్ చేసి వారించానని, తాను త్వరలో వచ్చి పరిష్కరిస్తానని చెప్పినట్లు తండ్రి జగదీశ్వరాచారి తెలిపారు. ఇది ఇలా ఉంటే ఈనెల 14న సాయంత్రం ఎదురింటి వారి ఫోన్ నుంచి తమ కుమార్తె గీతిక తన తల్లికి ఫోన్ చేసి తనను ఎలాగైనా చంపేసి కొడుక్కి మళ్ళీ పెళ్లి చేసుకోవాలని ఇంట్లో వారు మాట్లాడుకుంటుండగా విన్నట్లు చెప్పిందన్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికి గీతిక మామ శ్రీని వాసరావు ఫోన్ చేసి మీ అమ్మాయి గీతిక ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని చెప్పాడు అన్నారు. కేవలం ఆరునెలలకు ప్రేమపేరుతో తమ కుమార్తెకు మాయమాటలు చెప్పి తీసుకు వచ్చి చంపి మృతదేహాన్ని చేతిలో పెట్టారంటూ తండ్రి కన్నీరు మున్నీరయ్యారు. మృతురాలి తండ్రి జగదీశ్వరచారి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● తమ కుమార్తెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపిస్తూ మృతురాలి కుటుంబసభ్యులు అత్తింటి వద్ద బైఠాయించి నిరసనకు దిగారు. తమ కుమార్తె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని వారు వాపోయారు. తమకు న్యాయం చేయలని వారు పోలీసులను కోరారు. ఒంటిపై గాయాలున్నాయని వారు ఆరోపించారు.

అడవిలో ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకే కుట్ర

- ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కన్వీనర్ నవజ్యోతి

గుంటూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అడవిలో ఉన్న ఖనిజ సంపదలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకే కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీబావ వేదిక కన్వీనర్ కోలా నవజ్యోతి ఆరోపించారు. ఎవరీ ఆదివాసులు? వారిని ప్రభుత్వం ఎందుకు చంపుతుంది అనే కరపత్రాన్ని ఆదివారం నగరంలోని లాడ్జి సెంటర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవజ్యోతి మాట్లాడుతూ ఆదివాసులు అంటే మూలవాసులని, ఆదివాసులు నివసించే అడవిలో ఖనిజ సంపదలను కార్పొరేట్లకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం 116 ఒప్పందం చేసుకుందన్నా రు. ఆదాని అంబానీ లాంటి కార్పోరేట్ల నుంచి పర్యావరణాన్ని ఖనిజ సంపదలను, కాపా డుకోవడానికి ఆదివాసులు చేస్తున్న పోరాటానికి అందరూ అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, నన్నం పోతురాజు, డీ సుధాకర్, షేక్ బషీర్, షేక్ మహమ్మద్ అయూబ్, కర్రె నాగేశ్వరరావు, కేఎన్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మంచాల జోసెఫ్, పాపా బత్తిని ప్రభుదాస్ తదితరులున్నారు.

గాయత్రీ మహిళా సంగీత సన్మండలి సంచిక ఆవిష్కరణ


సంచికను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పి.విజయ, మస్తానయ్య

గుంటూరు(తూర్పు), మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటే శ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శని వారం గాయత్రీ మహిళా సంగీత సన్మండలి వార్షిక వేడుకలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు కార్యక్రమాల్ని గాయత్రీ మహిళా సంగీత సన్మండలి అధ్యక్షురాలు న్యూరాలాజిస్ట్ డాక్టర్ పి.విజయ ప్రారంభిం చారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ కే వీరన్, గౌరవఅతిథిగా ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో సంస్థ సంచికను డాక్టర్ కే వీరన్, డాక్టర్ విజయ ఆవిష్కరించారు. అనంతరం మల్లాది సింధు రాగేశ్వరి, విజయవాడ వారిని అతిథులు బంగారు పతకం ప్రదానం చేసి సత్కరించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాదు

గుంటూరు(తూర్పు), మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందా లంటే చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాదు అన్నా రు. స్థానిక విద్యానగర్ పార్క్ భవనంలో ఆదివారం శ్రీసాయినాథ సన్నిధానం, విద్యానగర్ పార్క్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆలపాటి రాజేంద్రప్రసాదుకు సత్కార కార్య క్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అసోసియేషన్ కార్యదర్శి యడ్లపాటి అశోక్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాదు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం కష్టపడుతున్న చంద్రబాబుకు అండగా నిలవాలని కోరారు. ఎన్నికల్లో నా వెన్నంటి నిలిచిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వంకాయలపాటి బలరామకృష్ణయ్య, షైనేని రాంప్రసాదు, వడ్లమూడి శివ రామకృష్ణయ్య, అద్దంకి శ్రీకృష్ణ, ఆవుల అప్పారావు, కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరామ్ ప్రసాదు, కొమ్మినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొని ఆలపాటి దంపతులను ఘనంగా సత్కరించారు.



మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాదు, పాల్గొన్న శ్రీసాయినాథ సన్నిధానం సభ్యు లు

దాతృత్వానికి ప్రతీక రంజాన్ మాసం

- ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్‌మాసం దాతృత్వా నికి ప్రతీకగా ఉంటుందని, సేవా గుణాన్ని ప్రపంచానికి చాటుతుందని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా గుంటూరు విద్యానగర్లో టీడీపీ నేత అల్తాఫ్, సాహీరభానుల ఆధ్వర్యంలో చేపట్టిన దుస్తుల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రమశిక్షణ, దాతృత్వం, ఆధ్యాత్మిక చింతన. ఈ మూడింటి కలయికే రంజాన్ అని తెలిపారు. రంజాన్ నెలలో అల్తాఫ్ ముందుకొచ్చి ఎంతో మంది పేదలకు దుస్తుల పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కొమ్మినేని కోటేశ్వరరావు, వేములపల్లి శ్రీరామ్‌ప్రసాద్, గంటా పెద్దబ్బాయి, మౌళిక, దిలావర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

అవినీతికి అడ్డుకట్ట పడటంతోనే మనోహర్ రాజీనామా

- టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి

గుంటూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో తన అవినీతి, అరాచకాలకు అడ్డుకట్ట పడడంతో మేయర్ మనోహర్‌నాయుడు పదవికి రాజీనామా చేశాడని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాస రావు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సొంతపార్టీకి చెందిన కార్పొరేటర్లే ఆయన్ని ఎప్పుడు పదవి నుంచి దింపేద్దామా అని ఎదురు చూశారని అన్నారు. దళితుడైన కమిషనర్ శ్రీనివాస్‌ను తన అవినీతికి సహకరించమని బెదిరించడమే కాకుండా అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేశాడన్నారు. జీఎంసీ చరిత్రలో మనోహరంత అవినీతిపరుడు ఇంకెవరూ లేరన్నారు. కేంద్రమంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేల సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీగా నిధులు తెచ్చి నగరాన్ని అభివృద్ధి చేస్తుంటే, కమీషన్ల కోసం వాటిని అడ్డుకోవాలని చూసి భంగపడి రాజీనామా చేశాడని విమర్శించారు. చంద్రబాబు అరెస్టు రోజున పోలీసుల అండతో మనోహర్ రౌడీయిజానికి పాల్పడిన, 'ఇటువంటి వ్యక్తి మేయర్‌గా ఎలా ఉంటున్నాడని' హైకోర్టు అక్షింతలు వేసిన సంగతులను ఆయన గుర్తుచేశారు. టీడీఆర్ బాండ్ల కుంభకోణం మొదలు చెత్తపన్ను వసూలు వరకు మనోహర్ చేసిన అవి నీతిపై విచారణ జరిపి కఠినంగా శిక్షిస్తామని కనపర్తి హెచ్చరించారు.

రైల్వే ట్రాక్‌ల సమీపంలో పశువులను మేపొద్దు : డీఆర్ఎం

గుంటూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రైల్వేట్రాక్‌ల సమీపంలో పశువుల ను మేపడానికి తీసుకురావొద్దని వాటి యజమానులకు గుంటూరు రైల్వే డీఆర్ఎం ఎం రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పశు వులు రైలు కింద పడి చనిపోవడం ఒక తీవ్రమైన సమస్యగా మారింది. దీని వల్ల రైలు భద్రతకు ప్రమాదం కలిగించడమే కాకుండా సమయపాల నని దెబ్బ తీస్తుందన్నారు. అలానే రైల్వే మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని చెప్పారు. తక్కువ వెలుతురులో కూడా పశువు లను దూరం నుంచి గుర్తించడానికి వాటికి ప్రకాశవంతమైన రంగు ట్యాగ్ లను వేయాలని సూచించారు. పశువులను రైలు పట్టాల దగ్గర వదిలి పెట్టడం చట్ట రీత్యా నేరమని, ఇందుకు వాటి యజమాని శిక్షార్హుడౌతాడని పేర్కొన్నారు. ఆరు నెలల వరకు జైలు శిక్ష/ రూ.వెయ్యి జరిమాన విధించే అవకాశం ఉందన్నారు.

ముట్లూరులో శ్రేష్ఠ హాస్పిటల్స్ ఉచిత వైద్యశిబిరం

గుంటూరు మెడికల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన శ్రేష్ఠ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ముట్లూరులోని శివాలయంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 130 మందికిపైగా రోగులు పాల్గొని ఉచిత వైద్య సలహాలు, మందులు పొందారు. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా ఈసీజీ పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు, బీఎండీ, పరీక్షలు నిర్వహించి సమగ్ర ఆరోగ్య తనిఖీలు జరిపారు. శిబిరంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగార్జున, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శ్రీనివాస్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సరళాదేవి పాల్గొని ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ గురించి అవగాహన కల్పించారు. వేసవిలో ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించి ప్రజలకు చక్కటి వైద్యసేవలు అం దించిన వైద్య బృందానికి, శ్రేష్ఠ హాస్పిటల్స్ యాజమాన్యం అభినందనలు తెలిపింది.


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఆవోపా ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ

గుంటూరు(విద్య), మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేటలోని ఆవోపా కార్యాలయంలో ఆదివారం అధ్యక్షుడు కేవీ బ్రహ్మం ఆధ్వర్యంలో 108 మంది పేదలకు పింఛన్ల పంపిణీ, అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి సంఘం నాయకులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సాయిప్రగతి ఇన్‌ఫ్రా డైరెక్టర్ తెడ్ల గురుప్రసాద రావు, కరూర్ వైశ్య బ్యాంకు మేనేజర్ సీహెచ్ అరవింద్ గణేష్, ఆవోపా రాష్ట్ర కార్యదర్శి రాచపుడి సుబ్బారావు, ఊటుకూరి నాగేశ్వరరావు, కార్యదర్శి రాధాకృష్ణయ్య, ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఈసెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నుంచి ఏపీ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ ఈసెట్) 2025 నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ (మేథ్స్) అభ్యర్థులకు 2025-26 విద్యా సంవత్సరంలో బీఈ/ బీటెక్/ బీఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ విధానంలో రెండో సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు 2025 ఏప్రిల్ 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 2025 మే 1 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ఎంట్రెన్స్‌ను అనంతపురంలోని జేఎన్‌టీయూ నిర్వహిస్తోంది. ప్రవేశ పరీక్ష 2025 మే 6వ తేదీన జరుగుతుంది. పూర్తి వివరాలకు https://cets.apsche.ap.gov.in/ APSCHE/APSCHEHome.aspx వెబ్‌సైట్ చూడవచ్చు.

ఎన్‌సీఎల్‌లో 1,765 అప్రెంటిస్ పోస్టులు

అప్రెంటిస్ పోస్టుల భర్తీకి నార్తరన్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్(ఎన్‌సీఎల్) దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. మొత్తం 1,765 పోస్టులు ఉన్నాయి. ఇందులో గ్రాడ్యుయేట్స్ 152, డిప్లొమా 597, ట్రేడ్ అప్రెంటిస్ 941 ఉన్నాయి. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సంస్థ అధికారిక వెబ్‌సైట్ nclcil.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి తేదీ 2025 మార్చి 18. అభ్యర్థుల వయస్సు 2025 మార్చి1వ తేదీ నాటికి 18 నుంచి 26 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

గడువు పెంపు

‘కొమెడెక్’

కర్నాటకలోని ఇంజనీరింగ్ కాలేజీల అడ్మిషన్లకు ఉద్దేశించిన కొమెడెక్ యూజీసెట్-2025కి (కన్సార్టియం ఆఫ్ మెడికల్, ఇంజనీరింగ్, డెంటల్ కాలేజెస్ ఆఫ్ కర్నాటక) దరఖాస్తు దాఖలు గడువును పొడిగించారు. జాతీయ స్థాయిలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించే ఈ పరీక్షను ప్రతీ సంవత్సరం తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు విద్యార్థులు రాస్తుంటారు. ఆసక్తి గల అభ్యర్థులు https://comedk.org/ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు పొందవచ్చు. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ 2025 మార్చి 20 తేదీ వరకు పెంచారు. కరెక్షన్ విండో ఏప్రిల్ 11 నుంచి 14 వరకు ఓపెన్‌గా ఉంటుంది. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 10వ తేదీ వరకు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకకోవచ్చు. ఎంట్రెన్స్ పరీక్ష మే10న జరుగుతుంది. ఫలితాలు మే 24న వెల్లడిస్తారు.

పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ దరఖాస్తు దాఖలు గడువును 2025 మార్చి 31 వరకు పొడిగించారు. ఈ మేరకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ వివరాలను తెలిపింది. తొలుత ఈ గడువు 2025 మార్చి 12 వరకు ఉంది. ఆసక్తి గల అభ్యర్థులు pminternship.mca.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ స్కీమ్ ద్వారా భారతదేశంలోని టాప్ 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభిస్తుంది. ఇందులో ఆయిల్ అండ్ గ్యాస్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్, ట్రావెల్ - హాస్పిటాలిటీ, మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ తదితర రంగాలు ఉన్నాయి. రిలయన్స్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతీ సుజుకీ, ఎల్ అండ్ టీ, టెక్ మహీంద్ర, బజాజ్ ఫైనాన్స్, మహీంద్ర అండ్ మహీంద్ర మొదలైన దిగ్గజ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభిస్తుంది. పదో తరగతి అర్హత ఉన్నవారు మొదలుకుని గ్రాడ్యుయేషన్ వరకు అందరూ ఈ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

మంచి కాలేజీ అయితేనే సరైన ప్లేస్‌మెంట్

దిక్సూచి DIKSUCHI

ఐసెట్ ప్రిపరేషన్ ప్లాన్



తెలుగు రాష్ట్రాల్లో ఎంబీఏ లేదా ఎంసీఏ(మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/ మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్) చేయాలంటే ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ రాయాలి. ఈ పరీక్షలో ర్యాంకు సాధిస్తే మంచి కాలేజీలో సీటు సంపాదించవచ్చు. ఏదో ఒక కాలేజీలో సీటు సులభమే. కానీ ప్లేస్‌మెంట్ సరిగ్గా ఉండాలంటే మాత్రం తప్పనిసరిగా మంచి కాలేజీలో చదవాలి. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఐసెట్ నోటిఫికేషన్ వెలువడింది. ఆంధ్రప్రదేశ్‌లో మే మొదటివారంలో ఎంట్రెన్ జరుగుతుండగా, తెలంగాణలో జూన్ మొదటి వారంలో నిర్వహిస్తున్నారు. రెండు సెట్‌ల పరీక్షల స్వరూపం ఒక్కటే. మొత్తం ప్రశ్నలు 200 ఉంటాయి. కామన్‌గా మూడు సెక్షన్లు ఉంటాయి. అవి అనలిటికల్ ఎబిలిటీ, మేథమెటికల్ ఎబిలిటీ, కమ్యూనికేషన్ ఎబిలిటీ. కాకపోతే ఒక్కో రాష్ట్రంలో ఈ ప్రశ్నలు ఒకటి ఎక్కువ, ఒకటి తక్కువ ఉండోచ్చు. ఐసెట్ ఎంట్రెన్స్ రాయాలంటే కనీసం 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేన్ పూర్తి చేయాలి. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా పరీక్ష రాయవచ్చు. ఎంసీఏలో చేరాలంటే మాత్రం ఇంటర్‌లో మేథ్స్ చదివి ఉండాలి. ఐసెట్‌లో 200 ప్రశ్నలకు 150 నిమిషాల్లో సమాధానాలు పూర్తి చేయాలి. అంటే ప్రతీ ప్రశ్నకు 45 సెకన్లు మాత్రమే సమయం ఉంటుందన్నమాట. అనలిటికల్, మేథమెటికల్ ఎబిలిటీల వంటి సెక్షన్లకు ఈ సమయం సరిపోదు. ఎంత ఎక్కువ ప్రాక్టీసు ఉంటే అంత వేగంగా సమాధానాలు గుర్తించగలుగుతారు. షార్ట్‌కట్‌లు తెలుసుకోవాలి. సమాధానం రాకుంటే సమయం వృథా కాకుండా పరీక్ష చివర్లో ప్రయత్నించాలి. సాధారణంగా 150 నుంచి 170 మధ్య టాప్ స్కోర్లు ఉంటాయి. 120 దాటిన వారికి కూడా మంచి కాలేజీల్లో సీట్లు లభించే అవకాశం ఉంటుంది. పలానా కాలేజీలో ఈ స్కోరుకు సీటు పక్కా. అని చెప్పడానికి ఉండదు. ప్రతీ సంవత్సరం మారే అవకాశం ఉంటుంది. అందుకే సాధ్యమైనంత మంచి ర్యాంకు తెచ్చుకోవాలి.

నోటిఫికేషన్ వివరాలు

- తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025 (టీజీ ఐసెట్) నోటిఫికేషన్ విడుదల అయింది. నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ దీనిని నిర్వహిస్తోంది. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ 2025 మే 3. ప్రవేశ పరీక్ష 2025 జూన్ 8, 9వ తేదీన నిర్వహిస్తారు.
- ఏపీ కామన్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీఐసెట్) కోసం ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈసారి విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహిస్తోంది. 2025 ఏప్రిల్ 9 లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశ పరీక్ష 2025 మే 7న జరుగుతుంది.

అడ్మిషన్స్

ఏపీ ‘ఈఏపీసెట్’



ఆంధ్రప్రదేశ్ ‘ఈఏపీసెట్’ దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ రాయాలనుకున్న విద్యార్థులు https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ చూడవచ్చు. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ 2025 ఏప్రిల్ 24. కరెక్షన్లకు మే 6వ తేదీ నుంచి మే 8 వరకు అవకాశం ఉంటుంది. మే 12 నుంచి ఈఏపీసెట్ వెబ్‌సైట్‌తోపాటు, రాష్ట్రప్రభుత్వ వాట్సాప్ నంబర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అగ్రికల్చర్, ఫార్మాస్యూటికల్ కోర్సులకు ఎంట్రెన్స్ మే 19, 20 తేదీల్లో, ఇంజనీరింగ్ కోర్సులకు మే 21 నుంచి 27 నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని 46 కేంద్రాల్లో, హైదరాబాద్‌లోని రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉర్దూ మాధ్యమాన్ని ఎంచుకున్నవారు కర్నూలులోని ప్రాంతీయ కేంద్రంలో ఎంట్రెన్స్ రాయాల్సి ఉంటుంది.

ఎంట్రెన్స్ విధానం:

- ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లో మొత్తం 160 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో 80 మేథ్స్, 40 ఫిజిక్స్, 40 కెమిస్ట్రీ నుంచి ఉంటాయి. ఇవన్నీ కూడా ఆబ్జెక్టివ్, మల్టీపుట్ చాయిస్ ప్రశ్నలు.
- అగ్రికల్చర్, ఫార్మసీ ఎంట్రెన్స్ ప్రశ్నపత్రంలో కూడా 160 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో బయాలజీ 80(బోటనీ 40, జువాలజీ 40), ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 40 ఉంటాయి.

ఫీజు: దరఖాస్తుతోపాటు జనరల్ అభ్యర్థులు రూ.600/-, బీసీ అభ్యర్థులు రూ.550/-, ఎస్సీఎస్టీ అభ్యర్థులు రూ. 500/- చెల్లించాలి.

SCHOLARSHIP ALERT

DRBT
Summer Internship Programme

IDRBT Summer Internship Programme (ISIP) 2025 is provided by the Institute for Development and Research in Banking Technology (IDRBT). The internship offers graduate and postgraduate students an opportunity to carry out projects in technological field.

Eligibility: Application is open to students enrolled in recognised post-graduate technology/management programs or four-year engineering degree course in reputed Indian institutions. Only those in their penultimate year of studies are eligible.

Rewards: A monthly stipend of Rs.12,500/-
Last Date to Apply: 15-04-2025
Application mode: Via email: isip@idrbt.ac.in
Short Url: www.b4s.in/aj/IDSI1



Flipkart
Foundation Scholarship

Flipkart Group is committed to strengthening the retail sector including the Kirana Stores which form a significant part. As part of our endeavour, the Flipkart Foundation is supporting a scholarship for children of Kirana Store Owners to make them future-ready. This scholarship is dedicated to empowering children of Kirana Store Owners enrolled in professional STEM (Science, Technology, Engineering, Math) undergraduate programs.

Eligibility: Applicants must be currently studying in the 1st year of professional undergraduate STEM (Science, Technology, Engineering, Math) courses at government colleges in India.

- One parent must be a Kirana Store Owner (KSO).
- Applicants must have scored at least 60% in their Class 12 exams.
- The annual family income should not exceed INR 5 lakh from all sources.

Rewards: Fixed scholarship of INR 50,000
Last Date to Apply: 16-04-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/FLIP1

buddy4study.com

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

కోర్ట్ నన్ను గెలిపించింది

నాని



ప్రియదర్శి కథానాయకుడిగా రామ్ జగదీష్ తెరకెక్కించిన చిత్రం ‘కోర్ట్’. హీరో నాని సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ చిత్రం విజయవంతంగా కొనసాగుతోన్న సందర్భంగా మేకర్స్ ఆదివారం సక్సెస్ మీట్ నిర్వహించారు. నాని మాట్లాడుతూ “నేను ఎప్పుడూ స్క్రిప్ట్, ప్రేక్షకుల అభిరుచినే నమ్ముతాను. ఈ సినిమా నన్ను, నా నమ్మకాన్ని గెలిపించింది” అని అన్నారు. “ఈ సినిమా కథ విని చాలా గొప్ప అనుభూతిని పొందాను” అని ప్రియదర్శి చెప్పారు. “జీవితాలనే మార్చేయగల శక్తి సినిమా సొంతం. ఈ విజయం చిత్రబృందానికి అంకితం” అని రామ్ జగదీష్ అన్నారు.

విలన్ వస్తున్నాడు



మోహన్‌లాల్ కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ తెరకెక్కించిన చిత్రం ‘ఎల్ 2 ఎంపురాన్’. ఈ నెల 27న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. అయితే ఈ చిత్రం విడుదల వాయిదా పడిదంటూ కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీన్ని ఖండిస్తూ చిత్రబృందం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 27న ‘ఎల్ 2 ఎంపురాన్’ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు అందులో తెలిపింది. ‘సరైన సమయమిది. అందరూ జాగ్రత్తగా ఉండండి. విలన్ మీ కోసం వచ్చేస్తున్నాడు’ అంటూ పృథ్వీరాజ్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

అన్ని వర్గాలనూ అలరిస్తుంది

నవీన్ యెర్నేని



సుశాంత్, జాన్యజోషి, విధి నటించిన హిందీ చిత్రం ‘పింటూ కి పప్పీ’. ఈనెల 21న మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా పలు భాషల్లో విడుదలవుతోంది. శివ్ హరే దర్శకత్వంలో విధి ఆచార్య నిర్మించారు. తెలుగులో ‘కిస్ కిస్ కిస్సిక్’ పేరుతో విడుదలవుతోంది. మురళీ శర్మ, గణేశ్ ఆచార్య, విజయ్‌రాజ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ “సినిమా రషెస్ చూశాను. చాలా బాగా వచ్చింది. అన్ని వర్గాలను ఆకట్టుకునే అంశాలున్నాయి. తొమ్మిది పాటలూ అద్భుతంగా ఉన్నాయి. సినిమా బ్లాక్‌బస్టర్ అవ్వాలి” అని ఆకాంక్షించారు. గణేశ్ ఆచార్య మాట్లాడుతూ “అందమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ సినిమా అందరినీ అలరిస్తుంది. కుటుంబ ప్రేక్షకులతో పాటు యూత్‌నూ ఆకట్టుకుంటుంది. సినిమా విజయంపై నమ్మకం ఉంది” అని చెప్పారు. హీరో సుశాంత్ మాట్లాడుతూ “సినిమా మంచి కమర్షియల్ ప్యాకేజీలా ఉంటుంది” అని తెలిపారు.

ఆగస్టులోనే రెండో యుద్ధం



బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న భారీ యాక్షన్ చిత్రం ‘వార్-2’. ఆర్యన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్ తెరకెక్కిస్తోంది. కాగా, ఈ సినిమాను ఆగస్టు 14న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం గతంలోనే ప్రకటించింది. అయితే కొన్ని రోజుల క్రితం షూటింగ్‌లో హృతిక్ కాలికి గాయం అవడం వల్ల చిత్రీకరణకు అంతరాయం ఏర్పడింది. దీనివల్ల మరింత జాప్యం జరిగి విడుదల వాయిదా పడుతుందంటూ బాలీవుడ్ మీడియాలో ప్రచారం జరిగింది. దీన్ని చిత్రబృందం ఖండించింది. హృతిక్ కోలుకోగానే మిగిలిన భాగాన్ని పూర్తి చేసి, ముందు ప్రకటించిన విధంగానే ఆగస్టు 14న ‘వార్ 2’ను విడుదల చేస్తామని యూనిట్ పేర్కొంది.

వినోదం గ్యారంటీ



నితిన్ కథానాయకుడిగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘రాబిన్‌హుడ్’. శ్రీలీల కథానాయిక. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించారు. ఈనెల 28న విడుదలవుతోంది. చిత్రబృందం భీమవరంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో హీరో నితిన్ మాట్లాడుతూ “సినిమా చాలా బాగా వచ్చింది. ప్రేక్షకుల్ని నిరుత్సాహపరచదు. పూర్తి వినోదం గ్యారంటీ” అని అన్నారు. “మనసుపెట్టి తీసిన చిత్రమిది. కచ్చితంగా మీ అంచనాలను అందుకుంటుంది. సినిమా విజయంపై నమ్మకం ఉంది” అని వెంకీ కుడుముల చెప్పారు. “ఈ సినిమాను థియేటర్లలో మీ కుటుంబసభ్యులతో మిత్రులతో కలసి చూడండి. బాగా ఎంజాయ్ చేస్తారు” అని వై. రవిశంకర్ తెలిపారు.

‘పుష్ప 3’.. మరో మూడేళ్లలో



అల్లుఅర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘పుష్ప 2: ద రూల్’ ఎంతటి ఘన విజయాన్ని సాధించిందో తెలిసిందే. ఆ చిత్రానికి కొనసాగింపుగా ‘పుష్ప 3: ద ర్యాంపేజ్’ ఉంటుందని మేకర్స్ అప్పట్లోనే ప్రకటించారు. ‘రాబిన్‌హుడ్’ ప్రెస్‌మీట్‌లో ‘పుష్ప 3’ గురించి నిర్మాత వై. రవిశంకర్ ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. “పుష్ప 3’ని 2028లో ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. అల్లు అర్జున్ ప్రస్తుతం తను చేయబోయే ప్రాజెక్ట్ పనుల్లో నిమగ్నమై ఉన్నారు” అని ఆయన తెలిపారు.

సంక్రాంతి కానుకగా మెగాస్టార్ సినిమా

- అనిల్ రావిపూడి



మెగాస్టార్ చిరంజీవి హీరోగా తను దర్శకత్వం వహిస్తున్న చిత్రం వచ్చే సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తుందని ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి తెలిపారు. తన ఆరాధ్య దైవం సింహాచలం వరాహలక్ష్మీ నృసింహస్వామి సన్నిధిలో ఆదివారం ఆయన సినిమా స్క్రిప్ట్‌నకు ప్రత్యేక పూజలు చేయించారు. తన బృందంతో కలిసి ఆదివారం ఉదయం సింహాచలం చేరుకున్న అనిల్ రావిపూడి ముందుగా ఆలయంలో కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం అంతరాలయంలో స్క్రిప్ట్‌నకు ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ మెగాస్టార్ ఇమేజ్‌కు తగ్గట్లుగా ఈ సినిమాకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.



ఇప్పటికే 90 శాతం స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని, మరో నెలరోజుల్లో సెట్స్‌మీదకు వెళ్తామన్నారు. మూడు నెలల షూటింగ్ పార్టు అనంతరం, పోస్టు ప్రొడక్షన్ వర్క్ పూర్తి చేసుకుని వచ్చే సంక్రాంతికి సినిమాను విడుదల చేయాలని నిర్ణయించామన్నారు. మెగాస్టార్ సినిమాల్లో పాటలు, సంగీతానికి ఉండే ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని భీమ్స్‌ను సంగీత దర్శకుడిగా ఎంచుకున్నామన్నారు. ప్రముఖ నేపథ్య గాయకుడు రమణ గోగులతో పాటలు పాడించాలని నిర్ణయించామని తెలిపారు.

సింహాచలం (ఆంధ్రజ్యోతి)



కొత్త తేదీన జాన్వీ చిత్రం

వరుణ్ ధావన్, జాన్వీకపూర్ జంటగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ‘సన్నీ సంస్కారీ కీ తుల్సీ కుమారి’. ఈ చిత్రం విడుదల తేదీ మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ చిత్రం ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదలవ్వాల్సి ఉంది. అయితే సెప్టెంబర్ 12న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు నిర్మాణసంస్థ ధర్మా ప్రొడక్షన్స్ ఆదివారం ప్రకటించింది. కుటుంబ అనుబంధాలు, ప్రేమ, భావోద్వేగాల మిళితంగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని యూనిట్ పేర్కొంది. ‘బవాల్’ తర్వాత వరుణ్, జాన్వీ జంటగా నటిస్తున్న చిత్రమిది. శశాంక్ ఖేతన్ దర్శకత్వం వహిస్తున్నారు. రోహిత్ సరాఫ్, సన్యా మల్హోత్రా కీలకపాత్రలు పోషిస్తున్నారు.

రెహ్మాన్‌కు అస్వస్థత

- **చికిత్స అనంతరం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్**



ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏ. ఆర్ రెహ్మాన్ ఆదివారం ఉదయం స్వల్ప అస్వస్థతకు లోనయ్యారు. వెంటనే ఆయన్ను చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత ఆయన డిశ్చార్జ్ అయ్యారు. డీహైడ్రేషన్, గ్యాస్ట్రిక్ సమస్య కారణంగా ఆయన ఒకింత అస్వస్థతకు గురవ్వడంతో, ఇందుకోసం చికిత్స తీసుకున్నారని రెహ్మాన్ సోదరి రెహానా వెల్లడించారు. ‘డీ హైడ్రేషన్, గ్యాస్ట్రిక్ ట్రబుల్ కారణంగా రెహ్మాన్ అస్వస్థతకు గురయ్యారు. చికిత్స తర్వాత కోలుకున్నారు. మధ్యాహ్నం ఆయనను డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపించాం’ అని వైద్యులు పేర్కొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ హాస్పిటల్ నిర్వాహకులకు ఫోన్ చేసి రెహ్మాన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మాజీ భార్య అనొద్దు : సైరా బాను



రెహ్మాన్ అనారోగ్యానికి గురయ్యారంటూ వచ్చిన వార్తలపై ఆయన భార్య సైరా బాను స్పందించారు. ఆయన ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. అలాగే, తన గురించి ప్రస్తావించేటపుడు రెహ్మాన్ మాజీ భార్య అని పిలవొద్దు అని ఆమె కోరారు. తాము ఇంకా అధికారికంగా విడాకులు తీసుకోలేదన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నానని, అందుకే రెహ్మాన్‌కు దూరంగా ఉంటున్నాననీ ఆమె వెల్లడించారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు



ప్రదీప్ మాచిరాజు కథానాయకుడిగా నటిస్తున్న ప్రేమకథా చిత్రం ‘అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి’. దీపికా పిల్లి కథానాయిక. మాంక్స్ అండ్ మంకీస్ బేనర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రబృందం ఆదివారం విడుదల తేదీని ప్రకటించింది. ఏప్రిల్ 11న ‘అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి’ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. కొత్త తరహా ప్రేమకథతో తెరకెక్కిన చిత్రమిదనీ, కుటుంబ ప్రేక్షకులను, యువతను ఆకట్టుకునే హంగులతో తెరకెక్కించామనీ మేకర్స్ తెలిపారు. వెన్నెల కిశోర్, సత్య, గెటప్ శ్రీను కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి రధన్ సంగీతం అందిస్తున్నారు. కథ, మాటలు: సందీప్ బొల్లా, సినిమాటోగ్రఫీ:ఎంఎన్ బాల్‌రెడ్డి, ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్

పశ్చిమ డెల్టాకాల్వకు 1316 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 1316 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.7 అడుగుల నీటి మట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 120, తూర్పు కాల్వకు 97, పశ్చిమకాల్వకు 133, నిజాంపట్నంకాల్వకు 72, కొమ్మమూరు కాల్వకు 660 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

నారా లోకేశ్ చొరవతో
డొంకరోడ్డు నిర్మాణం



శృంగారపురంలో పొలాలకు వెళ్లేందుకు నూతనంగా నిర్మించిన డొంకరోడ్డు

దుగ్గిరాల, మార్చి 16: శృంగారపురంలో 20 ఏళ్లుగా డొంకరోడ్డు నిర్మాణానికి నోచుకోక నానా అవస్థలు పడ్డ రైతుల కష్టాలు తీరాయి. స్థానిక నాయకుల ద్వారా డొంకరోడ్డు సమస్యను రాష్ట్రఐటీ, విద్య, మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లిన కొద్ది రోజుల్లోనే రూ.10లక్షల నిధులు మంజూరు చేయడం, ఆవెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టడం చకచకా జరిగిపోయాయి. తమ కష్టాలను ఇంత త్వరగా తీర్చి మాట నిలబెట్టుకున్న నారా లోకేశ్‌కు ధన్యవాదాలంటూ రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వందలాది ఎకరాల పంటను తరలించేందుకు మార్గం ఏర్పడిందంటూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

వట్టిచెరుకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వింజనంపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన వీరాల్‌పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయాల్లో నేటి ఉదయం విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా తరలి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా స్థానిక కిడ్స్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు, సెక్రటరీ కోయ శేఖర్‌ల ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

నేడు బీజేపీ మండల సర్వసభ్య సమావేశం

పెదనందిపాడు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సోమేశ్వరస్వామి కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 10గంటలకు బీజేపీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు వెలగా గంగాధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర నాయకులు జంధ్యాల వెంకటరామలింగేశ్వరశాస్త్రి, పరాంకుశం శ్రీనివాసరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పేద కుటుంబాలకు చేయూత

మంగళగిరి సిటీ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పారేపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పలు పేద కుటుంబాలకు చేయూతనందించారు. ఓ చిరు వ్యాపారికి తోపుడు బండి, మరో మహిళకు కుట్టుమిషన్, పది పేద కుటుంబాల వారికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పారేపల్లి రామకృష్ణ, విజయలక్ష్మి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, నేతలు పారేపల్లి దుర్గాప్రసాద్, తిరువీధుల కిరణ్, ధనుం జయ్, జంజనం వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ప్రజా చైతన్య యాత్ర



ఆత్మకూరులో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న సీపీఎం బృందం

మంగళగిరి సిటీ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఆత్మకూరులో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. గ్రామంలోని దళితవాడ, బీసీ కాలనీల్లో సీపీఎం నేతలు పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. పారిశుధ్యం, డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉండటంతో అనారోగ్యాల పాలవుతున్నామని, నిరుద్యోగ భృతి, విద్యాదీవెన, అమ్మఒడి పథకాలు అమలు కావడంలేదని, పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని గ్రామ ప్రజలు నేతల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈమని అప్పారావు, మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు, నేతలు మొసలి పకీరయ్య, గడ్డం అజయ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాగు నీరందక రైతుల కంట కన్నీరు



నీళ్లు లేక ఎండిపోయిన బండారుపల్లి మేజర్ కాల్వ

- గుంటూరు బ్రాంచికెనాల్ పరిధిలో పంటలకు నీటి గండం
- 2500 క్యూసెక్కుల నీటికి 1500 క్యూసెక్కులు విడుదల
- మిర్చి, మొక్క జొన్న పంటలకు అందని నీరు
- బండారుపల్లి మేజర్ కాల్వకు 10 క్యూసెక్కులు మాత్రమే
- సాగర్ జాలాల కోసం రైతులు ఎదురు చూపులు

తాడికొండ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పంట కోత దశకు వచ్చే సమయానికి సక్రమంగా నీరందక రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. మిర్చి, మొక్క జొన్న రైతులు సాగర్ జలాల కోసం ఎదురు చూస్తున్నారు. గుంటూరు బ్రాంచ్ కెనాల్ పరిధిలోని రైతులు వేలాది ఎకరాలు సాగర్ జలాలు మీద ఆదారపడి సాగు చేస్తున్నారు. గుంటూరు బ్రాంచ్ కెనాల్‌కు సాగర్ జలాలు 2500 క్యూసెక్కులు విడుదల చేస్తే పంటలకు పుష్కలంగా నీరందుతుంది. కానీ ఈ ఏడాది కేవలం 1500 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేశారు. దీంతో



గుర్రం వారి చెరువులో ఇంజన్లతో పొలాలకు నీరు పెడుతున్న దృశ్యం

పంటలకు పూర్తి స్థాయిలో నీరందటం లేదని రైతు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు బ్రాంచ్ కెనాల్ కింద గోరంట్ల మేజర్ కాల్వ, చిరుమామిళ్ల, లింగంగుంట్ల, అమరావతి, బండారుపల్లి, వంకాల యపాడు, నరుకుళ్లపాడు, కొండవీడు, చిలకలూరి పేట మేజర్



ఎండిపోయిన మిర్చి పంట

కాల్వలు ఉన్నాయి. ఈ కాల్వల కింద వేలాది ఎకరాలు మిర్చి, జొక్కజొన్న, శనగ, ప్రత్తి, మినుము తదితర పంటలను రైతులు పండిస్తుంటా రు. అయితే ఫిబ్రవరి నెలలో బండారుపల్లి మేజర్ కాల్వకు 240 క్యూసెక్యుల నీరు విడుదల చేయాల్సి ఉండగా కేవలం 10 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల చేశారు. అమరావతి, వంకాలయపాడు మేజర్ కాల్వల పరిస్థితి అదేవిధంగా ఉంది. పల్నాడు, గుంటూరు జిల్లా పరిధిలో మిర్చి పంటను వేలాదిగా రైతులు పండిస్తున్నారు. ఫిబ్రవరి 28 నుంచి ప్రభుత్వం వారాబంది విధించారు. పేరేచర్ల నుంచి బండారు పల్లి మేజర్ కాల్వ ప్రారంభమౌతుంది. ఈ కాల్వ కింద మందపాడు, విశదల, పేరేచర్ల, బండారుపల్లి, రావెల, పొన్నెకల్లు, గరికపాడు, బేజాత్‌పురం, లచ్చన్నగుడిపూడి, పాములపాడు, లేమల్లే, పెదపరిమి, తదితర గ్రామాలకు సాగర్ జలాలు అందాల్సి ఉంది. బండారుపల్లి కాల్వకు కేవలం 10 క్యూసెక్కుల నీళ్లు మాత్రమే రావటం వల్ల చివరి భూములకు చుక్క నీరందడం లేదు. దీంతో మిర్చి, మొక్కజొన్న రైతులు నీళ్ల కోసం గగ్గోలు పెడుతున్నారు. బండారుపల్లి మేజర్ కాల్వ కింద ప్రస్తుతం 9 వేల ఎకరాల్లో మిర్చి పంటను రైతులు పండిస్తున్నారు. మిర్చికి నీటి తడులు ఎక్కువగా కావాల్సి ఉంటుంది. కొద్ది మంది రైతులకు సాగర్ జలాలు అందడంతో కాపు బాగా వస్తుంది. నీరందని పంటలు ఎండిపోయే పరిస్థితి ఉంది. అయితే రైతులు చేసేది లేక దగ్గరలోని చెరువుల్లోని నీటిని ఇంజన్లతో తోడుకుంటున్నారు. దీంతో రైతులకు ఆర్థిక భారం పెరిగిపోతుంది. నీళ్లు సక్రమంగా అందక ఒక వైపు, వైరస్ సోకి మరోవైపు పంటలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘం నాయకులు స్పందించి సాగర్ జలాలను పూర్తిస్థాయిలో విడుదల చేయాలని రైతులు కోరుకుంటున్నారు.

నృసింహునికి శ్రీపుష్ప యాగోత్సవం



శ్రీపుష్ప యాగోత్సవంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి, అర్చకులు

మంగళగిరి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం శ్రీపుష్ప యాగోత్సవం నిర్వహించారు. పదకొండు రోజులపాటు సాగిన శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముగింపుగా దిగువ సన్నిధిలోని శ్రీకృష్ణదేవరాయ ముఖమండపంలో ఈ ఉత్సవం జరుపుతారు. స్వామికి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, దివ్య మంగళహారతి నిర్వహించారు. ఆదివారం రాత్రి శ్రీదేవీ, భూదేవీ సమేత నృసింహస్వామి వార్లతో ఆలయ ద్వాదశ ప్రదక్షిణలు చేశారు. ఈ ఉత్సవానికి నందం సాంబశివరావు, శాంతకుమారి దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో అర్చక బృందం శ్రీపుష్ప యాగోత్సవం నిర్వహించగా, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి అలంకారోత్సవాలు

మంగళాద్రి క్షేత్రం దిగువ సన్నిధిలో ఈ నెల 17 నుంచి 29వ తేదీ వరకు ఆస్థాన అలంకారోత్సవాలు జరుగనున్నాయి. ప్రతి రోజు సాయంకాలం స్వామి వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు. 30న ఉగాది తిరువంజనోత్సవం, శాంతి కల్యాణం, అదేరోజు మధ్యాహ్నం పంచాంగ శ్రవణం, సాయంత్రం బంగారు గరుడోత్సవం, రాత్రికి అద్దాల మహల్‌లో పవళింపు సేవ జరుగుతాయి.



మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో ఆదివారం రాత్రి టీడీపీ సీనియర్ నాయకులు మాదల రాజేంద్ర కుమార్తె మధువంతి, అన్నాబత్తుని సత్యనారాయణ చౌదరిల వివాహం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు మంత్రి లోకేశ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. చిత్రంలో ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మారెడ్డి ఉన్నారు.

కన్నుల పండువగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



దేవాలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు దంపతులు

ప్రత్తిపాడు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రత్తిపాడులోని యాదవుల బజారులో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. శిథిలమైపోయిన దేవాలయం స్థానంలో నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. రెండు రోజులుగా దేవాలయంలో కారంచేటి దక్షిణామూర్తి వేద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా విమాన శిఖరం, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తుల సమక్షంలో ఈ కార్యక్రమాలు ఎంతో కన్నుల పండుగలా జరిగాయి. ఈ సందర్భంగా భారీ అన్నదానం నిర్వహించారు. నూతనంగా ప్రతిష్ఠించిన దేవాలయంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జయమ్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు రామాంజనేయులు దంపతులను సాదరంగా ఆహ్వానించారు. అలాగే భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ దేవాలయంలో పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఈ మహోత్సవానికి హాజరయ్యారు.

పోలీస్ శాఖకు డ్రోన్ కెమెరా బహూకరణ

- దాత ఉప్పుటూరి చినరాములుకు ఎస్పీ సన్మానం



డ్రోన్ ఇచ్చిన చినరాములును అభినందిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ విభాగానికి వట్టిచెరుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుల్లడిగుంట గ్రామానికి చెందిన ఉప్పుటూరి చినరాములు డ్రోన్ కెమెరాను బహూకరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సతీష్‌కుమార్‌ని కలిసి డ్రోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పుటూరి చినరాములును ఎస్పీ దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీని వినియోగించి, నేరాల కట్టడికి చర్యలు చేపడుతున్నామని, అన్నారు. పోలీసింగ్ అవసరాల నిమిత్తం వట్టిచెరుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పుల్లడిగుంట గ్రామానికి చెందిన ఉప్పుటూరి చినరాములు, ఆయన కుమారుడు ఉప్పుటూరి రామ్‌చౌదరి సంయుక్తంగా నిర్వహిస్తున్న శ్రీఉప్పుటూరి చినరాములు సేవాట్రస్ట్ తరపున డ్రోన్ కెమెరాను గుంటూరు జిల్లా పోలీస్ విభాగానికి అందజేశారన్నారు. సామాజిక బాధ్యత, సేవా దృక్పథంతో డ్రోన్ కెమెరాను బహూకరించడం అభినందనీయమన్నారు. ఉప్పుటూరి చినరాములు, రామ్‌చౌదరిలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దాత చినరాములు, వట్టిచెరుకూరు సీఐ రామానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిని పట్టుకున్న రైతులు

- కంపెనీ పనుల కోసమని బుకాయింపు
- లారీని స్వాధీనం చేసుకున్న పోలీసులు

తుళ్లూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాజధాని రైతుల ప్లాట్లు, సీఆర్డీఏ భూముల్లో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిని రైతులు ఆదివారం మధ్నాహ్నం పట్టుకున్నారు. వెంకటపాలెం పడమర వైపు పశ్చిమ బైపాస్ తూర్పున ప్రదేశంలో మట్టిని తరలిస్తున్నారు. లారీ డ్రైవర్‌ని, మట్టిని తోలించే వ్యక్తిని రైతులు నిలువరించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏపీ 39 వైసీ 3706 నెంబరు గల లారీని పోలీసులకు రైతులు స్వాధీన పరిచారు. ఒక జేసీబీ అక్కడ నుంచి పరారైనట్టు తెలిసింది. మట్టిని ఎక్కడకి తరలిస్తున్నారని రైతులు అడగితే అదేదో కంపెనీకి అని చెప్పుకొచ్చారు. అనుమతి పత్రం అడిగితే సదరు వ్యక్తులు నోరెళ్ల బెట్టారు. వైసీపీ ప్రభుత్వంలో అక్రమార్కులు రాజధానిలో మట్టి, ఇసుక, నిర్మాణ మెటీరియల్ దొంగిలించారు. రాజధాని అనుకూలమైన కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇప్పుడు కూడా దొంగతనాలు చేయకుండా కాపాలా కాసుకోవాల్సిన



రైతులు ఆపిన మట్టి లారీ

పరిస్థితి రావటం దురదృష్టకమరమని రైతులు వాపోతున్నారు. వారం రోజుల నుంచి మట్టి దొంగతనం జరుగుతుందని రైతులు చెపుతున్నారు. సీఆర్డీఏ, పోలీసు వ్యవస్థ సరిలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ నుంచి ఎక్కడికైనా రాజధానిలో ఏది తరలించాలన్నా అనుమతి పత్రాలు సీఆర్డీఏ నుంచి తీసుకొని చేయాల్సి ఉందని రైతులు స్పష్టం చేస్తున్నారు. లారిని స్వాధీనం చేసుకొని నిజ నిర్థారణ చేస్తున్నామని తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు వివరణ ఇచ్చారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

మంగళగిరి సిటీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మండలంలో మొత్తం 13 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, ఎన్ బాబు తెలిపారు. మొత్తం 2,700 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 1,194 మంది కాగా, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 1,506 మంది వున్నారన్నారు.

దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి): మండలంలో పలుప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 631 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఎంఈవో కాజ శ్రీనివాసరావు తెలిపారు.

● పెదనందిపాడు, (ఆంధ్రజ్యోతి): పది పరీక్షలకు మండలంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల పరిధిలోని 9 జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన 186 మంది, 5 ప్రయివేటు పాఠశాలలకు చెందిన 129 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

● కాకుమాను (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో మొత్తంగా 223 మంది విద్యార్థులు కాకుమాను పరీక్ష కేంద్రంలో పరీక్షలకు హాజరువుతారని ఎంఈవో కెన్నడీ వివరించారు.

జయకేతనం సభ విజయవంతంపై హర్షం



మాట్లాడుతున్న చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం చిత్రాడలో జయకేతనం పేరిట జరిగిన జనసేన పార్టీ 12వ ఆవిర్భావసభ విజయవంతం కావడంపై ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్, మంగళగిరి జనసేన ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు హర్షం వెలిబుచ్చారు. మంగళగిరి నియోజకవర్గ జనసేన కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జనసేన ఆవిర్భావం నుంచి నేటి వరకు పోరాటాల ద్వారానే ప్రజలకు చేరువయ్యామని చెప్పారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదనే ఆనాడు టీడీపీ, బీజేపీతో కలిసి కూటమిగా ఏర్పడి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామన్నారు. జనసేన ఆవిర్భావ సభలో నేతలు చేసిన వ్యాఖ్యలపై వైసీపీ శ్రేణులు విషప్రచారం చేస్తున్నాయని, అది వారికి తాత్కాలిక సంతోషమే తప్ప ఏమాత్రం ఆ పార్టీ ప్రజలకు చేరువకాలేదని పేర్కొన్నారు. చంద్రబాబే మరో 15 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉండాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కోరుకుంటున్నారని, అది ఆయన దార్శనీకతకు నిదర్శనమని చెప్పారు. జయకేతనం సభను విజయవంతం చేసిన జనసేన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలకు చిల్లపల్లి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో జనసేన మండల అధ్యక్షుడు వాసా శ్రీనివాసరావు, జొన్న రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

- శివనామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం



గిరీశ్వరస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ

తాడికొండ, మార్చి 16: తాడికొండలోని శ్రీ గిరీశ్వర స్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా ఆదివారం జరిగింది. ధ్వజస్తంభంతో పాటు బలిపీఠ శ్రీకాల భైరవ విగ్రహాల ప్రతిష్ఠను చేపట్టారు. బ్రహ్మశ్రీ మామిళ్లపల్లి మృత్యుంజయ ప్రసాద్ శివాచార్య ఆధ్వర్యంలో ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు నిత్యపూజా విధులు, యంత్రపూజలు చేశారు. అనంతరం ఉదయం 9.09 గంటలకు ధ్వజస్తంభాన్ని వేదమంత్రాల నడుమ క్రేన్ సాయంతో ప్రతిష్ఠించారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగం మార్మోగింది. చాలా సంవత్సరాలు తరువాత గ్రామంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేయటంతో మహిళలు పెద్ద సంఖ్యలో తమ పుట్టింటికి తరలివచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు పర్యవేక్షణ చేపట్టారు.

ముట్లూరులో శ్రేష్ఠ హాస్పిటల్స్ వైద్యశిబిరం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గుంటూరుకు చెందిన శ్రేష్ఠ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ముట్లూరులోని శివాలయంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించా రు. ఈ వైద్యశిబిరంలో 130 మందికిపైగా రోగులు పాల్గొని ఉచిత వైద్య సలహాలు, మందులు పొందారు. ఈ సందర్భంగా రోగు లకు ఉచితంగా ఈసీజీ పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు, బీఎండీ, పరీక్షలు నిర్వహించి సమగ్ర ఆరోగ్య తనిఖీలు జరిపారు. శిబిరంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగార్జున, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శ్రీనివాస్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సరళాదేవి పాల్గొని ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ గురించి అవగాహన కల్పించారు. అదనంగా వేసవి కాలంలో ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్యశిబిరాన్ని విజయవంతంగా నిర్వహించి ప్రజలకు వైద్యసేవలు అందించిన వైద్యబృందానికి హాస్పిటల్స్ యాజమాన్యం అభినందనలు తెలిపింది.

గంజాయి విక్రయిస్తున్న అన్నదమ్ముల అరెస్టు

- రెండు కిలోల గంజాయి స్వాధీనం..
- రూ.75వేలు సొత్తు రికవరీ.. ఆటో సీజ్
- వివరాలు వెల్లడించిన సీఐ రమానాయక్



గంజాయితో పట్టుబడిన అన్నదమ్ముల వివరాలను వెల్లడిస్తున్న సీఐ రమానాయక్

వట్టిచెరుకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముట్లూరు గ్రామానికి చెందిన అన్నదమ్ములు గుట్టు చప్పుడు కాకుండా గ్రామంలోని గృహాల్లో చోరీలు, ఆ నగదుతో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అన్నదమ్ములను శనివారం రాత్రి మండలంలోని ముట్లూరు, లేమల్లెపాడు గ్రామాల మధ్య చెరువు వద్ద సీఐ రమానాయక్, సిబ్బంది అరెస్టు చేశారు. దొంగతనాలు, గంజాయి విక్రయాల వివరాలను సీఐ రమానాయక్ ఆదివా రం రాత్రి విలేకరులకు వివరించారు. ఈ ఇద్దరు అన్నదమ్ములు గత ప్రభు త్వంలో కూడా గంజాయి విక్రయాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో కం ప్యూటర్లు, గ్రామంలో పలు గృహాల్లో చోరీలకు పాల్పడ్డ ఉదంతాలు కోకొల్లలు. ఇటీవల గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్ గృహంలో ఇంటి తాళాలు పగల గొట్టి చోరీకి పాల్పడటం, అలాగే అతడికి చెందిన వేబ్రిడ్జి గదిలో నగదు చోరీ జరిగి న ట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని పలు ప్రాంతా ల్లో సీసీ పుటేజ్‌లు, గ్రామస్థుల నుంచి అందిన సమాచారం మేరకు ఇద్దరు అన్నదమ్ములపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ భానోదయ ఆదేశాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ముట్లూరుకి చెందిన అల్లం సాయి ఉరఫ్ సాంబశివరావులు, అల్లం నరేంద్ర ఉరఫ్ నాని అన్నదమ్ములు. వీరు ఎప్పటి నుంచే గృహాల్లో చోరీలకు పాల్పడటం, చోరీ సొత్తు తో గంజాయి కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్లుగా ఆటో ద్వారా వినియోగ దారులకు సరఫరా చేస్తున్నట్టు సమాచారంతో నిఘా ఉంచారు. శనివారం ఇద్దరు సోదరులు ముట్లూరు, లేమల్లెపాడు గ్రామాల మధ్య ఉన్న బాపయ్య చెరువు వద్ద ఉన్నట్టు సమాచారం అందుకున్న సీఐ రమానాయక్ సిబ్బందితో దాడి చేసి వారిని అరెస్టు చేశారు. వారి వద్ద రెండు కిలోల గంజాయి ఉన్నట్టు సమాచారం. వారిని విచారించగా గతంలో ముట్లూరు సచివాలయంలో దొంగ తనం, పలు గృహాల్లో చోరీలకు పాల్పడిన సొత్తు నాలుగు ఉంగరాలు, వెండి పట్టీలు, రూ.10వేలు నగదు, కంప్యూటర్, ప్రింటర్‌ను స్వాధీనం చేసుకొని ఆదివా రం అరెస్టు చేసి కోర్టుకు హాజ రుపరచగా రిమాండ్‌కు పంపి నట్టు సీఐ వెల్లడించారు. ఇద్దరు అన్నదమ్ములను అరె స్టు చేయటంలో హెడ్ కానిస్టే బుల్ శ్రీనివాసరావు, పీసీలు రవి, శ్రీనివాసరావు, ప్రసాదు లు సీఐ రమానాయక్ నేతృ త్వంలో ఈ అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళి



ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న అధికారులు

తాడికొండ(లాంఫాం)మార్చి 16(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆదివారం ఆయన చిత్ర పటానికి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జీ రామచంద్రరావు, విశ్వవిద్యాలయం అధికారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని సాధించటానికి 58 రోజుల పాటు అమరణ నిరాహర దీక్షలు చేసి ప్రాణాలు అర్పించారన్నారు. కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు జీ శివనారాయణ, కమ్యూనిటీ సైన్స్ డీన్ శ్రీలక్ష్మీ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

● **తుళ్లూరు (ఆంధ్రజ్యోతి):** ఆంధ్ర రాష్ట్రం ఏర్పడటానికి 58రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసిన పొట్టి శ్రీరాములు త్యాగధనుడని, పట్టువదలని విక్రమార్కుడని ఆర్యవైశ్య సంఘ సభ్యులు కొనియాడారు. తుళ్లూరులోని కన్యకాపరమేశ్వరి సత్రంలో శ్రీరాములు విగ్రహానికి ఆర్య వైశ్య సంఘ సభ్యులు పూలదండలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘ సభ్యులు సనిశెట్టి నాగమల్లేశ్వరావు, చందోలు పూర్ణచంద్రరావు, గుండా శ్రీనివాసరావు, చామర్తి హరీష్,తొడెంపు సురేంద్ర, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

● **పెదనందిపాడు (ఆంధ్రజ్యోతి):** పొట్టి శ్రీరాములు జీవితం చిరస్మరణీయమని ప్రముఖ పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావు అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద, లైబ్రరీలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహ, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు, గ్రంథాలయ నిర్వాహకులు సుభాషిణి, ఆర్యవైశ్య సంఘ నాయకులు దాసరి సత్యనారాయణ, డీఎల్ఎస్ ప్రసాద్, కూనిశెట్టి బాలంజనేయులు, దాసరి రాధాకృష్ణమూర్తి, విద్యాసాగర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

● **దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి):** రైలుపేట చెక్‌పోస్ట్ వద్దనున్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలువురు కూటమి నాయకులు, ఆర్యవైశ్య సంఘీయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా ప్రదానకార్యదర్శి చుండూరు ఉమా మహేశ్వరరావు, టీడీపీ నాయకులు గూడూరు వెంకట్రావు, కొంగర సుధీర్‌కుమార్, జనసేన అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, కాజ బాస్కరరావు, అన్నవరపు సత్యనారాయణ, భాస్కరుని వెంకటేశ్వరరావు, చుండూరు లక్ష్మణకుమార్, గరికా శ్రీనివాసరావు, వంకదార ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పది పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

తెనాలి రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ మండల గ్రామాల్లో సోమవారం నుంచి నిర్వహిస్తున్న పది పరీక్షల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా 144సెక్షన్ అమలు చేస్తున్నట్లు మండల మెజిస్ట్రేట్ గోపాలకృష్ణ తెలిపారు. పరీక్ష కేంద్రాలకు 200మీటర్ల దూరంలో జిరాక్సు షాపులు, గుంపులుగా చేరడం వంటివి నిషేధమన్నారు. పది పరీక్షలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సంబంధిత శాఖ అధికార యంత్రాంగం పర్యవేక్షించాలన్నారు. ఈ నెల 31 వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆదివారం విడుదల చేసిన ఉత్తర్వులలో పేర్కొన్నారు.

వృద్ధుడిని కాపాడిన ఎస్డీఆర్ఎఫ్ బృందం


వెంకటరత్నంను కాపాడిన ఎస్డీఆర్ఎఫ్ బృందం

విజయవాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కనదుర్గమ్మ దర్శనానికి వచ్చి ప్రమాదవశాత్తు ప్రకాశం బ్యారేజీ సమీపంలోని కెనాల్‌లో పడిన వృద్ధుడిని ఏపీఎస్డీఆర్ఎఫ్ బృందం రక్షించింది. దుర్గమ్మను దర్శించుకుని మొక్కు చెల్లించుకునేందుకు శనివారం గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన అమర వెంకటరత్నం (80) ఒంటరిగా విజయవాడ వచ్చాడు. శనివారం సాయంత్రం రథం సెంటర్ నుంచి నడుచుకుంటూ వెళుతూ ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడిపోయాడు. అదేసమయంలో ప్రకాశం బ్యారేజీ వద్ద విధుల్లో ఉన్న ఏపీ ఎస్డీఆర్ఎఫ్ బృందం హుటాహుటిన ఐఆర్‌బీ పడవ సాయంతో కెనాల్ నుంచి వెంకటరత్నంను ఒడ్డుకు చేర్చారు. అతడి వద్ద ఉన్న రూ.50వేల నగదును నీటిలో కొట్టుకుపోకుండా జాగ్రత్తచేశారు. అతడిని వన్‌టౌన్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు వృద్ధుడి నుంచి వివరాలు తెలుసుకుని పొన్నూరులో ఉన్న అతడి కుటుంబ సభ్యులకు సమాచారం తెలియపరిచి వారు వచ్చిన తర్వాత వెంకటరత్నంను అప్పగించారు. కొద్ది రోజులుగా వెంకటరత్నం ఉపవాసం చేశాడని, అమ్మవారిని దర్శించుకుని మొక్కు చెల్లించుకోవటానికి ఒంటరిగా వచ్చాడని అతడి కుమార్తె పోలీసులకు తెలిపింది. వృద్ధుడిని రక్షించిన ఎస్డీఆర్ఎఫ్ ఆర్ఎస్ఐ ఎం.మహేంద్ర నాయక్, సిబ్బంది శివ, పద్మనాభం, సుదర్శన్ రెడ్డి, హుస్సేన్, నాగన్న, సత్యనారాయణలను అధికారులు అభినందించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గాంధీనగర్‌లోని షిరిడి సాయి వృద్ధాశ్రమంలో ఆదివారం ఎస్వీ యోగా సభ్యుడు గుర్రం మల్లికార్జునరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు గుర్రం శివ ప్రకాశ్‌రావు, కోడలు శిరీష, కుటుంబ సభ్యుల సహకారంతో ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి ఆహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీ యోగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, సరోజ, అనూష, ఆశ్రమ నిర్వాహకులు సునీత, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు...

తెనాలి అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పేదలు, యాచకులకు ఆదివారం సినీ దర్శకుడు దిలీప్ రాజా అన్నదానం చేశారు. ఫర్ ది లీస్ట్ ఆఫ్ దేమ్ బైబిల్ మినిస్ట్రీ తరుపున ఈ కార్యక్రమం నిర్వహించారు.

విలీనంపై వ్యతిరేకత

● పురపాలక సంఘంలో విలీనానికి వ్యతిరేకంగా తీర్మానాలు


పొన్నూరు పురపాలక సంఘ ఏరియల్ వ్యూ

పొన్నూరు టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పురపాలక సంఘంలో సమీప గ్రామాలను విలీనం చేయాలని గత ప్రభుత్వ హయాంలో చేసిన ప్రతిపాదనలకు బ్రేక్ పడినట్లేనని పలువురు భావిస్తున్నారు. పొన్నూరు పురపాలక సంఘాన్ని మరింత విస్తరించాలని గత ప్రభుత్వ హయాంలో ఆరు గ్రామ పంచాయతీలను విలీనం చేయాలని నాటి పాలకులు అడ్డదారిలో ప్రయత్నించారు. పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించకుండా ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలను పురపాలక సంఘంలో విలీనం చేస్తున్నట్లు ఉత్తర్వులు తెచ్చారు. పట్టణ పరిధిలోని చింతలపూడి, వడ్డిముక్కల, ఆలూరు, కట్టెంపూడి, ఇటికంపాడు, కసుక్కర్రు గ్రామాలను విలీనానికి ప్రతిపాదనలు ఇవ్వడమే కాకుండా పంచాయతీరాజ్ వ్యవస్థ నుంచి గ్రామాలను ఉపసంహరించుకుంటూ ఉత్వర్వులు తీసుకువచ్చారు. అయితే పొన్నూరు పట్టణానికి భౌగోళికంగా దగ్గరగా ఉన్నప్పటికి రాకపోకలకు అనువుగా లేని వడ్డిముక్కల, ఆలూరు, ఇటికంపాడు గ్రామాల ప్రజలు ఈ విలీన ప్రతిపాదనలు తీవ్రంగా వ్యతిరేకించారు. పొన్నూరు పురపాలక సంఘంలో 31 వార్డులు ఉండగా ఈ ఆరు గ్రామాలను విలీనంచేస్తూ మరో ఐదు వార్డులు పెంచేలా పురపాలక సంఘంలో 36 వార్డులుగా విభజిస్తూ నాటి పాలకులు నిర్ణయించారు. గ్రామాల ప్రజల అనుమతులు లేకుండా విలీనం చేయడం వార్డుల విభజన అసంబద్ధంగా ఉండడం నిబంధనలకు విరుద్ధంగా నాటి పాలకులు, అధికారులు వ్యవహరించిన తీరుపై చింతలపూడి తదితర గ్రామాల ప్రజలు హై కోర్టును ఆశ్రయించి స్టే ఆర్డర్ తెచ్చుకున్నారు. దీంతో విలీన గ్రామాలతో పాటు పురపాలక సంఘానికి కూడా ఎన్నికలు నిలిచిపోయాయి. అప్పటి నుంచి విలీన ప్రతిపాదిత ఆరు గ్రామాలలో పురపాలనకానీ, పంచాయతీరాజ్ పాలనకానీ లేకపోవడంతో గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది.

నిలిచిన నిధులు

విలీన ప్రతిపాదనలపై న్యాయపరమైన చిక్కులు వీడకపోవడంతో ఆరు పంచాయతీలతో పాటు 61,500 జనాభా ఉన్న పొన్నూరు పురపాలక సంఘానికి కూడా ఎన్నికలు జరగలేదు. ఐదేళ్లుగా ఎన్నికలు లేకపోడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి పురపాలక సంఘానికి, పంచాయతీలకు నేరుగా వచ్చే ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. ప్రజా పాలన లేకపోవడం వలన పురపాలక సంఘానికి ఐదేళ్లలో రూ.10కోట్లు ఆరు గ్రామ పంచాయతీలకు రూ.2కోట్ల వరకు ఆర్థికసంఘ నిధులు కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో వైసీపీ పాలకుల అర్థరహిత నిర్ణయాలతో పట్టణ అభివృద్ధితో పాటు విలీన ప్రతిపాదిత గ్రామాల అభివృద్ధి కూడా కుంటుపడింది. మరోవైపు ఈ గ్రామాలను పంచాయతీరాజ్ వ్యవస్థ నుంచి రికార్డుల్లో తప్పించడంతో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కూడా నిలిచిపోయింది. ఈ గ్రామాలలో చేసిన ఉపాధి పనులకు బిల్లులు మంజూరు కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ప్రధానంగా వ్యవసాయమే జీవనాధారంగా మనుగడ సాధించే ఈ గ్రామాలలో ఉపాధి పనులు కూడా లేకపోవడం అభివృద్ధి పూర్తిగా అడుగంటి పోయింది.


విలీనానికి వ్యతిరేకంగా సంతకాలు చేస్తున్న ప్రజలు

విలీనానికి వ్యతిరేకంగా సంతకాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పురపాలక సంఘం దుస్థితి, గ్రామాల అధోగతిపై ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి లేఖ ద్వారా తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ విజ్ఞప్తితో స్పందించిన ప్రభుత్వం మరోమారు విలీన గ్రామాలలో ప్రజాభిప్రాయాన్ని గ్రామసభల ద్వారా తీసుకోవాలని ఆదేశించింది. ఇప్పటివరకు ఐదు గ్రామాలలో గ్రామ సభలు జరగగా ఈ ఐదు గ్రామాల ప్రజలు పురపాలక సంఘంలో విలీనాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తూ గ్రామ సభలలో తీర్మానాలుచేసి సంతకాలు చేశారు. అంతేకాకుండా ఈ విలీన గ్రామాలలో డ్వాక్రా పొదుపు సంఘాలను కూడా పురపాలక సంఘంలోని మెప్మాలో అడ్డదారిలో విలీనంచేశారని వాటిని కూడా తిరిగి డ్వాక్రాలో చేర్చాలని ఆయా గ్రామాల వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామ పంచాయతీలలో ఎన్నికలు జరగక తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పంచాయతీలలో నిధులు లేక నిర్వీర్యం అయిపోయాయని విలీన గ్రామాల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి తమ అభిప్రాయాలకు విలువనిచ్చి తమ గ్రామాలను పంచాయతీరాజ్ వ్యవస్థలోనే కొనసాగించాలని ఆయా విలీన గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు

● జిల్లా ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ సుబ్బారావు


పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జిల్లా ఆర్యవైశ్య సంఘ సెక్రటరీ సుబ్బారావు, మల్లికార్జునరావు, శ్రీనివాసరావు తదితరులు


పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు


కొల్లిపరలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

తెనాలి, మారీసుపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కోసం ఆత్మార్పణ చేసిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని గుంటూరు జిల్లా ఆర్యవైశ్య సంఘ సెక్రటరీ పెండేల సుబ్బారావు అన్నారు. స్థానిక మారీసుపేటలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆదివారం పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాలను పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు గోనుగుంట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఆర్యవైశ్య సంఘ సెక్రటరీ పెండేల సుబ్బారావు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు జీవీపీఏ గుప్తా, టి.శ్రీరామచంద్రమూర్తి, తల్లం మారుతి, ఆలమూరు మురళి తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరమని జిల్లా ఆర్యవైశ్య యువజన నేత కొప్పురావూరి హరికిషోర్ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని బోసురోడ్డులోని శ్రీరాములు కాంస్య విగ్రహం వద్ద ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజ సంఘం, వాసవీ యూత్, పట్టణ సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఆయన త్యాగాన్ని కొనియాడారు. కార్యక్రమంలో దేసు రవికుమార్, నాళం రజనీకుమార్, అనీల్‌కుమార్, పృథ్వీ, బదరి, సతీష్, హేమంత్, అశోక్ ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి సాధుప్రతాప్, ఆలపాటి శివ, రామమోహనావు, సత్యనారాయణ, పున్నారావు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

● తెనాలి రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడటానికి ఆనాడు అమరజీవి పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి తన ప్రాణాలను సైతం త్యాగంచేసి ఉమ్మడి తెలుగు రాష్ట్రాలను సాధించారని ఆయన త్యాగ ఫలితమే నేటి తెలుగు రాష్ట్రాలని కొలకలూరు శాఖ గ్రంథాలయాధికారి కడియాల సుజాత చెప్పారు. ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి విద్యార్థులతో కలిసి పూలమాలలు వేసిఘన నివాళులర్పించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. సీహెచ్ వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● కొల్లిపర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపరలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నవరపు రమేష్ మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరిచిపోలేనిదన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ గౌరవ అధ్యక్షుడు మునగాల రామలక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు దాసరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి చుండూరు వెంకటరత్నం, కోశాధికారి కాజా ప్రసాదరావు, వాసవీ క్లబ్ అధ్యక్షురాలు చుండూరు వెంకటసావిత్రి, వాసవీ క్లబ్ కార్యదర్శి మునగాల పద్మావతి, కోశాధికారి మునగాల సుభద్రాదేవి, కమిటీ సభ్యులు రేవంత్, బొల్లిశెట్టి వంశీ, కోటా సత్యనారాయణ, బొల్లిశెట్టి హరీష్, నాళం రమాదేవి, మునగాల జయలక్ష్మి పాల్గొన్నారు.


కోత దశకు వచ్చిన జొన్న పంట, కొల్లిపరలో జొన్న పంటను కూలీలతో కోయిస్తున్న రైతు

డెల్టాలో కోత దశలో జొన్న, మొక్కజొన్న

● ఆశాజనకంగా ధరలు ● వీటిపైనే రైతన్నల ఆశలు

కొల్లిపర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): డెల్టా ప్రాంతంలో ఈ సంవత్సరం ఖరీఫ్‌లో మాగాణిలో వేసిన వరిలో అధిక దిగుబడులు వచ్చినప్పటికి ధాన్యానికి ధర అంతంత మాత్రంగా ఉండటంతో రైతులు అధికంగా నష్టపోయారు. రబీలో అయినా ఆ నష్టాన్ని పూడ్చుకుందామనే ఉద్దేశంతో డెల్టా ప్రాంతమైన కొల్లిపర మండలంలో వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, తూములూరు, అత్తోట, చక్రాయపాలెం తదితర గ్రామాల్లోని రైతులు రెండో పంటగా జొన్న, మొక్కజొన్న పంటలను అధిక విస్తీర్ణంలో సాగుచేశారు. మొక్కజొన్న, జొన్నలకు మార్కెట్‌లో రైతులు ఆశించిన ధర ఉండటంతో రైతులు మొక్కజొన్న, జొన్న పంటలపైనే ఆశపెట్టుకున్నారు. నిత్యం ఆ పంటలపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నీటి తడులు అందించారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు మేరకు ఖర్చులకు కూడా వెనకాడకుండా ఎరువులను తగిన సమయంలో అందించడంతో పాటు చీడపీడలు ఆశించకుండా పురుగు మందులను పిచికారీ చేశారు. ముందస్తుగా సాగుచేసిన మొక్కజొన్న, జొన్న పంటలు కోత దశకు వచ్చాయి. జొన్న పంట కోతకు సిద్ధం అవ్వడంతో కొంతమంది రైతులు గత ఐదు రోజుల నుంచి కూలీలతో కోయించడం ప్రారంభించారు. ఈ సంవత్సరం మొక్కజొన్న పంట సాగుచేసినందుకు ఎకరానికి రూ.30వేలు ఖర్చు అయ్యిందని, అదేవిధంగా జొన్న సాగుచేసినందుకు ఎకరానికి 20వేల రూపాయల వరకు వ్యయం అయినట్లు రైతులు తెలిపారు. గత సంవత్సరం మొక్కజొన్నలో ఎకరానికి 30నుంచి 35 బస్తాల వరకు దిగుబడులు వచ్చాయని, ఈ సంవత్సరం అదే దిగుబడులు రావచ్చునని మొక్కజొన్న రైతులు భావిస్తున్నారు. జొన్నలో కూడా ఈ సంవత్సరం 25 నుంచి 30 బస్తాల వరకు దిగుబడులు రావచ్చునని రైతులు భావిస్తున్నారు.

మందగించిన ఆస్తి పన్ను వసూళ్లు

● వడ్డీ మాఫీ కోసం ఎదురుచూపు ● 73 శాతం మాత్రమే పన్ను వసూలు

తెనాలి అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘాల్లో ఆస్తి పన్ను వసూళ్లు మందగించాయి. ప్రతి ఏటా పన్నుపై వడ్డీ మాఫీ ఉండటంతో మార్చి నెలలో పన్ను చెల్లింపులు నూరుశాతంకు చేరేవి. ఈ ఏడాది వడ్డీ మాఫీ లేకపోవడంతో తెనాలి పురపాలక సంఘ పరిధిలో పన్నుల చెల్లింపు ఆశించిన మేరకు జరగలేదు. కేవలం 73 శాతం మాత్రమే పన్ను వసూళ్లు సాధించగలిగినట్లు రెవెన్యూ విభాగం లెక్కలు చెబుతున్నాయి. సెలవు రోజుల్లోనూ రెవెన్యూ విభాగంతో పాటు పన్ను చెల్లింపు కౌంటర్లు పని చేస్తున్నాయి. ఆదివారం ఈ కౌంటర్‌లో రూ.4లక్షలు మాత్రమే పన్ను వసూలైంది. మునిసిపాలిటీలో రూ.21కోట్లు పన్ను బకాయి ఉండగా ఈ ఏడాది వసూలు కావాల్సింది రూ.17.56 కోట్లు, ఇందులో రూ.15 కోట్లు వరకు వసూలైనట్లు అధికారులు చెబుతున్నారు. సెలవు రోజుల్లోనూ కౌంటర్లు పనిచేస్తుండగా పట్టణంలో విస్తృతమైన ప్రచారం, సిబ్బంది ఇంటింటికి తిరిగి పన్ను చెల్లించాలని కోరడం చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో పన్ను చెల్లింపులు జరగకపోవడానికి వడ్డీ మాఫీ లేకపోవడమే కారణమని భావిస్తున్నారు. ఆస్తి పన్ను ప్రతిఏటా రెండు విడతలుగా చెల్లించాల్సి ఉంటుంది. మొదటి విడత సెప్టెంబరు 30లోగా, రెండో విడత మార్చి 31లోగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ విడతలలో నిర్దేశించిన గడువు మీరితే పన్ను మొత్తంపై వడ్డీ విధిస్తున్నారు. రూ.5వేలు పన్నుకు రూ.500 వరకు వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. గత ఏడాది మార్చి నెలలో వడ్డీ రాయితీ కల్పించడంతో పన్ను చెల్లింపులు వేగంగా జరిగాయి. ఈ ఏడాది వడ్డీ మాఫీ ప్రకటించకపోవడంతో పన్నుల చెల్లింపు మందగించినట్లు చెబుతున్నారు. ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 10రోజులు మాత్రమే గడువు ఉండగా ఈ ఏడాది వడ్డీ మాఫీ లేదని మునిసిపల్ రాష్ట్ర శాఖ స్పష్టం చేసిందని రెవెన్యూ విభాగం అధికారులు చెబుతున్నారు. 95 శాతం వసూళ్లు లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.

వృద్ధాప్యంలో సమస్యలపై అవగాహన

తెనాలి అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఎదుర్కొనే సమస్యలపై సైకాలజిస్టు జి.నగరాజ కుమారి అవగాహన కల్పించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఒంటరితనం, మతిమరుపు, ఆందోళన, మానసిక కుంగుబాటు, ఆత్మస్థైర్యం కోల్పోవడం వంటి అంశాలను వివరించారు. సభ్యులు చెప్పిన సమస్యలకు పరిష్కారం చూపారు. అసోసియేషన్ సభ్యులు ఆమెను ఘనంగా సన్మానించారు. మార్చి నెలలో పుట్టిన సీనియర్ సిటిజన్లను సత్కరించారు. అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, కార్యదర్శి నాగేశ్వరరావు, మల్లికార్జునరావు, రాంబాబు, భుజంగరావు పాల్గొన్నారు.


సైకాలజిస్టు నగరాజకుమారిని సత్కరిస్తున్న సభ్యులు


గరిమెళ్ల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ పురుషోత్తమరావు

టీటీడీ ఆస్థాన గాయకుడు గరిమెళ్లకు ఘన నివాళి

తెనాలి అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ ఆస్థాన గాయకుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ సంస్మరణ సభ ఆదివారం కొత్తపేటలోని అతిథి గ్రాండ్‌లో నిర్వహించారు. గరిమెళ్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంకీర్తన కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.పురుషోత్తమరావు మాట్లాడుతూ, వెయ్యికి పైగా అన్నమయ్య కీర్తనలను స్వరపరిచారని, 2020లో కేంద్ర ప్రభుత్వ నాటక అకాడమీ అవార్డు సాధించారని చెప్పారు. అన్నమయ్య కీర్తనల ప్రాచుర్యానికి కృషిచేసిన ఆయన లేనిలోటు తీరనిదన్నారు. ఈ సందర్భంగా అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. ఆంజనేయశాస్త్రి, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పరీక్ష కేంద్రాన్ని తనిఖీచేస్తున్న రాయల సుబ్బారావు తదితరులు

నేటి నుంచి పది పరీక్షలు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షల కోసం విద్యా శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 270మంది విద్యార్థులు, పరీక్షలకు హాజరు కానున్నారు. నిడుబ్రోలు 5వ వార్డు పాఠశాలలో 147మంది, వివేక హైస్కూల్‌లో 174మంది, ఏపీ హైస్కూల్‌లో 296మంది, నేతాజీ హైస్కూల్‌లో 164, పచ్చలతాటిపర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో 153, చింతలపూడి ఉన్నత పాఠశాలలో 154మంది, మొత్తం ఏడు పాఠశాలలో 1358మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. అలాగే ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలలో 100మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఎంఈవో శ్రీనివాసరెడ్డి వివరించారు. అలాగే చేబ్రోలు మండలంలో 488మంది పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నట్లు ఎంఈవో రాయల సుబ్బారావు తెలిపారు. రెండు మండలాల్లో పరీక్ష కేంద్రాలను ఆదివారం అధికారులు తనిఖీలుచేసి విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.


పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న అర్బన్ బ్యాంకు చైర్మన్ హరిప్రసాద్

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

తెనాలి అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారీసుపేటలో ఆదివారం పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. 22వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ ఫాతిమా వర్ధంతి పురస్కరించుకుని అర్బన్ బ్యాంకు చైర్మన్ మంగమూరి హరిప్రసాద్ దుస్తులు అందజేసి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో షేక్ సుభాని, రావి చిన్ని, ఈదర పూర్ణచంద్, నాగేశ్వరరావు, కేసన కోటేశ్వరరావు, కన్నెగంటి మురళి, ఆలపాటి వెంకట్రామయ్య, రాజశేఖర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


స్వామి వారి శాంతి కల్యాణం జరిపిస్తున్న భక్తులు

ఘనంగా శ్రీవాసవీ ఆలయంలో బ్రహ్మోత్సవ పూజలు

తెనాలి అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బోసురోడ్డులోని శ్రీవాసవీ అమ్మవారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం శ్రీవింధ్యా వాసిని నగరేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. లలితా సహస్రనామ పారాయణ, రుద్రహోమం, నవగ్రహ హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో తిరు కల్యాణ మహోత్సవం, శాంతి హోమం నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించిన రథంపై ఉంచి ఊరేగించారు. అర్చకులు మారుతీ చక్రవర్తి, నుదురుపాటి రామకోటేశ్వరశర్మ, రామలింగశర్మ, కమిటీ ప్రతినిధులు గంగాధరరావు దంపతులు, నరసింహారావు దంపతులు పూజల్లో పాల్గొన్నారు.



కొల్లిపరలో ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు

జీవకోటి రక్షణే మానవాళికి రక్ష

పిరమిడ్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు

కొల్లిపర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జీవహింస మహాపాపమని జీవకోటి రక్షణే మానవాళికి రక్ష అని పిరమిడ్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షుడు వెలగపూడి లక్ష్మణరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రం కొల్లిపరలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు మహాయజ్ఞం నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ జంతువుల పట్ల ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండాలని తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే శాకాహారం అమృతహారం అన్నారు. ఆత్మజ్ఞానాన్ని పొందటానికి శాకాహారం మాత్రమే తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మర్షి శంకరరావు, డాక్టర్ జాష్టి వెంకట సుబ్బారావు, పిరమిడ్ సభ్యులు అవుతు పద్మావతి, ఆరిమండ చంద్రావతి, గాదిరాజు సత్యన్నారాయణ, భీమవరపు ఇందిర, నీలం విజయలక్ష్మి, నీలం సుధాకర్‌రావు, సుగ్గుల లత తదితరులు పాల్గొన్నారు.